

గాజాలోని నాజర్ మెడికల్ ఆసుపత్రిలో ఇజ్రాయిల్ వైమానిక బాంబు దాడుల్లో తీవ్రంగా గాయపడిన పసికందు

మళ్లీ గాజాలో ఇజ్రాయిల్ బాంబు దాడులు!

లోపలి పేజీలో..

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 121 | విజయవాడ, శనివారం 2 డిసెంబర్ 2023 | 6 + 8 పేజీలు వెల : 5. 50

Vol No | Vijayawada, Saturday 2 December 2023 | Rs



స్పిన్నర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్..

- నాల్గో టి20లో 20పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా
- సిరీస్ 3-1తో కైవసం

లోపలి పేజీలో..



విద్యాశాఖ అధికారులతో సమావేశమైన సిఎం జగన్మోహన్‌రెడ్డి

నూరుశాతం ఇంగ్లీష్‌లోనే...

పరీక్షలు రాసేలా చర్యలు

- విద్యాశాఖ సమీక్షలో ముఖ్యమంత్రి జగన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని నూరుశాతం విద్యార్థులు ఇంగ్లీషు మీడియంలోనే పరీక్షలు రాసేలా తయారు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. విద్యాశాఖపై క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ ఇంగ్లీషులో పరీక్షలు రాయడమంటే ఉన భయాన్ని విద్యార్థుల నుండి తొలగించాలని సూచించారు. దీనికి అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ దేశం మొత్తంగా 37.03శాతం మంది మాత్రమే ఇంగ్లీష్ మీడియంలో పరీక్షలు రాస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలో మాత్రం ఆ సంఖ్య 84.11శాతంగా ఉందని చెప్పారు.

మిగిలిన పిల్లలకుకూడా చేయూత నివ్వాలని సిఎం చెప్పారు. వెనుకబడిన వారిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు.

డిసెంబర్ మూడో వారం నాటికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌పి ప్యానెళ్ల ఏర్పాటు పూర్తి చేయాలని చెప్పారు. అన్ని పాఠశాలలకు ఇంటర్‌నెట్ సదుపాయం కచ్చితంగా ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు రెండో దశ పనులు నిర్దేశించుకున్న గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తొలిదశలో పూర్తయిన పాఠశాలల నిర్వహణను క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. వచ్చే విద్యాసంవత్సరం లో 6వ తరగతి నుంచి ఫ్యూచర్ స్కిల్స్‌పై పాఠ్యాంశాలను బోధిస్తున్నట్లు అధికారులు సిఎంకు తెలిపారు. డిసెంబర్ 21 నుంచి 8వ తరగతి విద్యార్థులకు ట్యాబులు పంపిణీ చేస్తామన్నారు. ట్యాబుల బోధన ఉపాధ్యాయుల్లో మంచి మార్పులు తీసుకొచ్చిందని వివరించారు. దాదాపు 7వేల ట్యాబులను డ్యామేజ్ అవ్వడంతో తిరిగి రీప్లేస్ చేశామన్నారు. పదో తరగతి ఫెయిలైన 1,49,515 మంది విద్యార్థులు తిరిగి బడుల్లో చేరారని చెప్పారు. దేశంలో నూటికి నూరుశాతం పిల్లలను బడికి పంపడంలో నంద్యాల తొలిజిల్లాగా రికార్డు సృష్టించిందని అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో విద్యాశాఖ సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డి, ఎపిఈడబ్ల్యుఐడిసి చైర్మన్ నాగార్జున యాదవ్, పాఠశాల విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ప్రవీణ్ ప్రకాష్, కమిషనర్ ఎస్ సురేష్‌కుమార్, మౌలిక సదుపాయాల కమిషనర్ కాటమనేని భాస్కర్, ఆర్థిక శాఖ కార్యదర్శి కెవివి సత్యనారాయణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ కె హేమచంద్రారెడ్డి, సమగ్ర శిక్ష డైరెక్టర్ బి శ్రీనివాసరావు, ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి, ఎపిఎస్ఎఫ్ఎల్ ఎండి ఎం మధుసూధన రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెండోసారి ఆమోదించి పంపిన బిల్లులను

రాష్ట్రపతికి నివేదించలేరు

- సిఎంతో సమావేశమై పరిష్కరించుకోండి
- తమిళనాడు గవర్నర్‌కు సుప్రీంకోర్టు సూచన

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

శాసనసభ తీర్మానించి పంపిన బిల్లులకు తమిళనాడు గవర్నర్ ఆమోదముద్ర వేయకపోవడంపై ప్రతిష్టంభన కొనసాగుతున్న నేపథ్యంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌తో సమావేశమై సమస్య పరిష్కరించుకోవాలని తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని అత్యున్నత న్యాయస్థానం సూచించింది. తాము ఉన్నతమైన రాజ్యాంగబద్ధ వ్యవస్థలతో వ్యవహరిస్తున్నామని చెబుతూనే.. శాసనసభ రెండోసారి ఆమోదించిన బిల్లులను రాష్ట్రపతి పరిశీలనకు గవర్నర్ పంపలేరని స్పష్టం చేసింది. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులను గవర్నర్ ఉద్దేశపూర్వకంగానే ఆమోదించడం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ జెబి పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. తమిళనాడు ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపిస్తూ.. 'గవర్నర్ వెనక్కి పంపిన బిల్లులను తమిళనాడు అసెంబ్లీ మళ్లీ ఆమోదించి రాజ్‌భవన్‌కు పంపింది. గవర్నర్ వాటిని రాష్ట్రపతికి రిజర్వ్ చేశారు' అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలను ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. 'బిల్లుల ప్రతిష్టంభనకు గవర్నర్ తెరదించాలని కోరుకుంటున్నాం. ఈ దిశగా ముఖ్యమంత్రితో కలిసి నడిస్తే అభినందిస్తాం. సిఎంను గవర్నర్ ఆహ్వానించి.. సమస్య పరిష్కారానికి చర్చలు జరుపుతారని ఆశిస్తున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. ఈ కేసులో ఉన్నతమైన రాజ్యాంగబద్ధ వ్యవస్థల (గవర్నర్)తో వ్యవహరిస్తున్నామనే విషయం తెలుసని సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఈ క్రమంలోనే తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి తన ఆమోదాన్ని నిలుపుదల చేస్తూ రాష్ట్ర అసెంబ్లీ తిరిగి ఆమోదించి

మిగతా 5లో

14 లక్షల ఎకరాల్లో పంట నష్టం

- ఎన్యూమరేషన్ కొలిక్కి
- ఇన్‌పుట్ సబ్సిడీకి 844 కోట్లు కావాలి
- కేంద్రాన్ని అడిగేది 503 కోట్లు



ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్‌లో ప్రభుత్వం ప్రకటించిన కరువు మండలాల్లో వ్యవసాయ పంటల నష్టం అంచనాలు ఎట్టకేలకు పూర్తయ్యాయి. తొలుత ప్రాథమికంగా 7.14 లక్షల మంది రైతులకు చెందిన 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బ తిన్నాయని ఎస్టిమేట్ చేశారు. రైతుల వివరాలతో సహా సమగ్ర ఎన్యూమరేషన్ అనంతరం మొదట వేసిన అంచాల కంటే నష్టం స్వల్పంగా తగ్గింది. చివరికి 6.68 లక్షల మంది రైతులకు సంబంధించిన 14.21 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లిందని తేల్చారు. స్టేట్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డిఆర్ఎఫ్) నిబంధల ప్రకారం నవంబర్ 14న ప్రభుత్వం జారీ చేసిన జిఓఎంఎస్ నెం.5లో పేర్కొన్న విధంగా పంటలు నష్టపోయిన రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపుల కోసం రూ.844.14 కోట్లు కావాలని అంచనా వేశారు. నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫండ్ (ఎన్‌డిఆర్ఎఫ్) నిబంధనల ప్రకారం ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపుల కోసం రూ.503.11 కోట్లు అవసరమవుతాయని, కేంద్రం ఆ నిధులివ్వాలని కోరనున్నారు. ఇదిలా ఉండగా రైతుల వివరాలతో రూపొందించిన లబ్ధిదారుల జాబితాలను సోషల్ ఆడిట్ కోసం గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శనకు పెట్టారు. అభ్యంతరాలు, వినతుల పరిశీలన అనంతరం తుది జాబితాలను శుక్రవారం నాటికి కలెక్టర్ల ద్వారా రాష్ట్ర కేంద్రానికి పంపాలని ఆదేశించారు. కాగా మరో ఒకటి రెండు రోజులు సమయం కావాలని కిందిస్థాయి సిబ్బంది గడువు కోరాగా అందుకు అంగీకరించారు. ఈ అంచనాలు కేవలం 7 జిల్లాల్లో ప్రకటించిన 103 మండలాలకే పరిమితం. ఉద్యానవన పంటల అంచనాలు వేరేగా ఉన్నాయంటున్నారు. కాగా రాష్ట్ర వ్యాప్తంగా కరువు తాండవిస్తున్న దృష్ట్యా మరిన్ని మండలాలను గుర్తించాలన్న రైతుల డిమాండ్‌ను సర్కారు పట్టించుకోలేదు.

జిల్లా	ప్రకటించిన మండలాలు	పంట నష్టం ఎకరాలు
కర్నూలు	24	6,49,835
అనంతపురం	28	4,75,572
శ్రీసత్యసాయి	21	1,90,670
నంద్యాల	06	57,925
అన్నమయ్య	18	39,225
ఎన్‌టిఆర్	02	4,857
చిత్తూరు	04	2,960

10, 12 తరగతి పరీక్షల్లో డివిజన్, డిస్టింక్షన్ ఉండవ్

సిబిఎస్ఇ

న్యూఢిల్లీ : 10, 12 తరగతి పరీక్షల్లో డివిజన్, డిస్టింక్షన్స్ ఇకపై ఉండవని కేంద్ర మాధ్యమిక విద్యా మండలి (సిబిఎస్ఇ) శుక్రవారం తెలిపింది. మార్కుల శాతాన్ని కూడా పేర్కొనరాదని నిర్ణయించింది. ప్రతి సబ్జెక్టులో మార్కులను ఇచ్చే విధానాన్నే కొనసాగిస్తామని, అవసరమైతే ఉన్నత విద్యాసంస్థ, సంబంధిత యజమాని వాటిని లెక్కించుకోవచ్చునని సిబిఎస్ఇ తెలిపింది.

'డివిజన్, డిస్టింక్షన్, మార్కుల మొత్తాన్ని ప్రకటించం. అలాగే, ఒక అభ్యర్థి ఐదు కంటే ఎక్కువ సబ్జెక్టులను ఎంచుకుంటే.. ఇందులో ఉత్తమమైన ఐదు సబ్జెక్టులనే అడ్మిషన్ పొందిన సంస్థ లేదా యాజమాని తీసుకోవచ్చు' అని సిబిఎస్ఇ ఎగ్జామినేషన్ కంట్రోలర్ సన్యాం భరద్వాజ్ తెలిపారు. మార్కుల శాతాన్ని లెక్కించడం, ప్రకటించడం లేదా తెలియజేయడాన్ని సిబిఎస్ఇ చేయదని భరద్వాజ్ తెలిపారు. తదుపరి ఉన్నత విద్యకు లేదా ఉద్యోగంలో మార్కుల శాతం అవసరమైతే వాటిని ప్రవేశం పొందిన సంస్థ, యజమాని లెక్కించుకోవచ్చునని తెలిపారు.

విద్యారంగంలో అనారోగ్య పోటీని నివారించడానికి సిబిఎస్ఇ గతంలోనే మెరిట్ లిస్టులను ఇచ్చే పద్ధతిని నిలిపివేసింది. సిబిఎస్ఇ 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు వచ్చే ఏడాది ఫిబ్రవరి 15 నుంచి ప్రారంభం కానున్నాయి. భారత్‌తోపాటు 26 దేశాల్లో 28 వేలకు పైగా సిబిఎస్ఇ అనుబంధ పాఠశాలలు ఉన్నాయి. గత సిబిఎస్ఇ 10వ తరగతి పరీక్షకు 21 లక్షలకు పైగా విద్యార్థులు, 12వ తరగతి పరీక్షకు 16 లక్షలకుపైగా విద్యార్థులు హాజరయ్యారు.

రూ.13,878 కోట్ల లోటు

- ప్రభుత్వ సబ్సిడీతో భర్తీ చేస్తాం
- విద్యుత్ టారిఫ్ యథాతథం
- ఎఆర్ఆర్‌లో డిస్కంల ప్రతిపాదన



ఎపిఇఆర్‌సి చైర్మన్ నాగార్జున రెడ్డికి, విజయానంద్ సమక్షంలో నివేదికలను అందజేస్తున్న ట్రాన్స్‌కో జెఎండి చక్రధర్ బాబు, డిస్కంల సిఎండిలు ఐ పృథ్వీతేజ్, పద్మజనార్ధన్ రెడ్డి, కె సంతోషరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రానున్న ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ.13,878.11కోట్ల రూపాయల లోటుతో వార్షిక ఆదాయ అవసర నివేదికల(ఎఆర్ఆర్)ను డిస్కమ్‌లు ప్రతిపాదించాయి. ఈ మేరకు డిస్కమ్‌లు అందించిన ప్రతిపాదనల వివరాలను ఆంధ్రప్రదేశ్ రెగ్యులేటరీ కమిషన్ మీడియాకు శుక్రవారం విడుదల చేసింది. . ఏఆర్ఆర్‌పై ప్రజాభిప్రాయ సేకరణ జరిపి మార్చి 31న కొత్త టారిఫ్‌ను ఇఆర్‌సి ప్రకటించే సంగతి తెలిసిందే. అయితే, తమ ప్రతిపాదనల్లో డిస్కమ్‌లే విద్యుత్ టారిఫ్‌లో ఎటువంటి మార్పులను సూచించలేదు. లోటు మొత్తాన్ని ప్రభుత్వమిచ్చే సబ్సిడీలతో భర్తీ చేసుకుంటామని పేర్కొన్నాయి. రాన్ను ఆర్థిక సంవత్సరంలో విద్యుత్ అమ్మకం 74,522.67 మిలియన్ యూనిట్లు(ఎంయు)గా ఉంటుందని తెలిపాయి. ఇందులో వ్యవసాయానికి అందించే ఉచిత విద్యుత్ 12,321.58ఎంయులుగా పేర్కొన్నాయి. 83,118.13 ఎంయుల విద్యుత్‌ను కొనుగోలు చేయాల్సిఉంటుందని, దీనికోసం రూ.39,017.60 కోట్లు అవుతుందని పేర్కొన్నాయి. ట్రాన్స్‌మిషన్, లోడ్ డిస్పాచ్ ధర రూ.5,722.88కోట్లుగా, డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ధర రూ.9514.42కోట్లుగా, ఇతర ఖర్చులు రూ.2321.13కోట్లుగా పేర్కొన్నాయి. . ఈ మొత్తం కలుపుకుని వచ్చే ఏడాది రూ.56,576.03కోట్లు ఖర్చు అవుతుందని చూపించాయి. ఇందులో వివిధ వనరుల ద్వారా రూ.42,697.92కోట్ల ఆదాయం వస్తుందనిరూ.13,878.11కోట్లు లోటు ఉంటుందని వివరించాయి. ఎఆర్ఆర్ ప్రకారం రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ నష్టాలు 2.60శాతంగా ఉంది. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఇండియా లిమిటెడ్(పిజిసిఐఎల్) అంతరాష్ట్ర నష్టాల శాతం 0.9గా ఉంది. మొత్తంగా సరఫరా నష్టాలు 6.84శాతంగా టాన్స్‌మిషన్, డిస్ట్రిబ్యూషన్ నష్టాలు 10.34శాతంగా చూపించారు. . గతేడాది(2023-24) ఆర్థిక సంవత్సరంలో ఆదాయ లోటు రూ.11,800కోట్లుగా ప్రతిపాదించగా, ఎపిఈఆర్‌సి రూ.10,135కోట్లకు అనుమతి ఇచ్చిందని వివరించాయి. ఉచిత వ్యవసాయ విద్యుత్ సరఫరా ఖర్చు, ఇతర సబ్సిడీ వినియోగదారులకు చెల్లించాల్సిన నగదుతో పాటు లోటును ప్రభుత్వం భర్తీ చేసిందని గుర్తుచేశాయి.

తుపానును సమర్థవంతంగా

ఎదుర్కోవాలి

- కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ
- సన్నద్ధంగా ఉన్నామన్న సిఎస్
- జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

లోపలి పేజీలో..

నిధులు, సాంకేతికత బదిలీ కీలకం

- సంపన్న దేశాలకు ప్రధాని మోడీ సూచన
- 2028లో కాప్ సమ్మిట్‌కు ఆతిథ్యమిస్తామని ప్రతిపాదన

లోపలి పేజీలో..



కేంద్రం గుప్పిట్లోకి 'సాగర్'

- కెఆర్ఎంబికి నిర్వహణ
- రక్షణ బాధ్యత సిఆర్‌పిఎఫ్‌కు
- నవంబర్ 28కి ముందున్న స్థితి ప్రకారం నీటి విడుదల
- రెండు రాష్ట్రాల అంగీకారం
- శ్రీశైలం ప్రాజెక్టుకు కూడా అదే స్థితి?

ప్రజాశక్తి-యంత్రాంగం

తెలుగు ప్రజల ప్రతిష్టాత్మక ప్రాజెక్టు నాగార్జున సాగర్ కేంద్రం గుప్పిట్లోకి వెళ్లిపోయింది. ఇప్పటిదాకా వివాదాలను పరస్పరం చర్చించి, పరిష్కరించుకునే అవకాశం ఉండగా ఇక నుండి కేంద్రం కన్నుసన్నల్లోనే వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. డ్యామ్ రక్షణతో పాటు, నీటి విడుదలను కూడా కేంద్రం తన పరిధిలోకి తీసుకుంది. దీంతో ప్రతి చిన్న అవసరానికి కేంద్రం మీద ఆధారపడాల్సిన పరిస్థితి తెలుగురాష్ట్రాలకు ఏర్పడింది. ఈ మేరకు కేంద్ర హోమ్‌మంత్రిత్వ శాఖ శుక్రవారం చేసిన ప్రతిపాదనలను రెండు

మిగతా 2లో

సెబీకి మొట్టికాయలు

- ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని దెబ్బతీయొద్దు
- ముంబయి హైకోర్టు కీలక వ్యాఖ్యలు



ముంబయి : పెట్టుబడులు, స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజి బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ)కి బాంబే హైకోర్టు మొట్టికాయలు వేసింది. భారత్ నిధి లిమిటెడ్ తన మైనారిటీ వాటాదారుల, సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపిస్తూ వచ్చిన ఫిర్యాదులపై అక్టోబర్‌లో ఇచ్చిన ఆదేశాలను సెబీ పాటించనందుకు కోర్టు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజా ప్రయోజనాల కోసం సెబీ చర్యలు తీసుకోవాలని, అందుకోసమే పని చేయాలని ఆదేశించింది. సెబీ విధానం మదుపుదార్ల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని న్యాయమూర్తులు జిఎస్ కులకర్ణి, జితేంద్ర జైన్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'భారత్ నిధి' మైనారిటీ షేర్ హోల్డర్లకు కొన్ని పత్రాలను అందించాలని అక్టోబర్‌లో ఆ కంపెనీని, అదే విధంగా సెబీని హైకోర్టు ఆదేశించింది. ఈ ఉత్తర్వును ఆ కంపెనీ, సెబి సుప్రీంకోర్టులో సవాలు చేశాయి. ఆ అప్పీల్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో తిరిగి విషయం బాంబే కోర్టుకు చేరింది. భారత్ నిధి లిమిటెడ్ తన మైనారిటీ వాటాదారుల, సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించిందని ఆరోపిస్తూ ఫిర్యాదులందడంతో సెబి దర్యాప్తు ప్రారంభించింది. కంపెనీకి షోకాజ్ నోటీసు జారీ చేసింది. కానీ విచారణ డాక్యుమెంట్లను ఫిర్యాదు దార్లకు ఇవ్వడానికి నిరాకరించింది. దీన్ని సవాల్ చేస్తూ సెబీ చేస్తున్న దర్యాప్తు ప్రహసనంగా ఉందని పిటిషనర్లు ఆరోపించారు. ఫిర్యాదు దారుల సెటిల్‌మెంట్ ఆర్డర్‌ను రద్దు చేసినందున.. ప్రస్తుత పిటిషన్లలో ఏమీ మనుగడలో లేదని సెబీ తాజాగా హైకోర్టుకు తెలిపింది. దీనిపై హైకోర్టు ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "సెబీ తీరు ఆమోదయోగ్యంగా లేదు. పబ్లిక్ బాడీ అయిన సెబీ ప్రజా ప్రయోజనాల కోసం పని చేయాల్సిన అవసరం ఉంది. కోర్టు జారీ చేసిన ఆదేశాలకు లోబడి ఉండాలి. ప్రస్తుత కేసులో సెబీ తీసుకున్న విధానం మమ్మల్ని చాలా ఆశ్చర్యానికి గురి చేసింది. సెబి విధానం పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. పార్లమెంట్ ద్వారా అందుబాటులోకి వచ్చిన రెగ్యులేటరీ బాడీ సెబీ తన లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి మాత్రమే పని చేయాలి." అని ధర్మాసనం ఘాటుగా వ్యాఖ్యానించింది. తాము ఇచ్చిన ఆదేశాలను సెబీ పాటించకుండా ఉండేందుకు సాధ్యమైన అన్ని ప్రయత్నాలను చేసిందని, ఇది అర్థరహితమని పేర్కొంది. పిటిషనర్లకు పత్రాలను అందించాల్సిన అవసరం ఉందని, తన ఆదేశాలను సెబీ వెంటనే పాటించాలని ధర్మాసనం ఆదేశించింది.

విభజన హామీల సాధనలో విఫలం

రాష్ట్ర ప్రభుత్వ తీరుపై పార్లమెంటులో లేవనెత్తాలి • టిడిపి ఎంపిలతో చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విభజన చట్టం హామీల సాధనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని, పోలవరం ప్రాజెక్టును నిర్లక్ష్యం చేసిందని టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు విమర్శించారు. ఈ అంశాలను పార్లమెంటులో లేవనెత్తాలని ఆ పార్టీ ఎంపిలకు సూచించారు. శుక్రవారం గన్నవరం విమానాశ్రయం నుంచి ర్యాలీగా ఉండవల్లిలోని నివాసానికి ఆయన చేరుకున్నారు. అనంతరం టిడిపి పార్లమెంటరీ సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో ప్రజా సమస్యలపై పార్లమెంటులో ప్రస్తావన ద్వారా జగన్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చంద్రబాబు చెప్పారు. రాష్ట్రంలో వ్యవస్థలు గాడి తప్పి వ్యవహరిస్తున్న విధానాన్ని ప్రస్తావించాలన్నారు. అన్ని విధాలా విఫలమైన జగన్ ప్రభుత్వం ఓట్ల జాబితాలో అక్రమాల ద్వారా లబ్ధి పొందాలని చూస్తుందని, దీనిపై ఢిల్లీలో గళం వినిపంచాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం వివిధ పథకాల కింద రాష్ట్రానికి నిధులు ఇస్తున్నా సద్వినియోగం చేసుకోవడంలో రాష్ట్రం పూర్తిగా విఫలమైందని సమావేశం అభిప్రాయం వ్యక్తం చేసింది. ఈ సమావేశంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు కె అచ్చెన్నాయుడు, ఎంపిలు కె రామ్మోహన్‌నాయుడు, కేశినేని నాని, కనకమేడల రవీంద్రకుమార్, నేతలు నిమ్మల రామానాయుడు, కంభంపాటి రామ్మోహన్‌రావు, టిడి జనార్ధన్, గురజాల మాల్యాద్రి పాల్గొన్నారు.



గన్నవరం విమానాశ్రయం వద్ద చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న టిడిపి నాయకులు - వార్త లోపలిపేజీల్లో

గిరిజన బాలికపై గ్యాంగ్ రేప్

ప్రజాశక్తి-శింగరాయకొండ (ప్రకాశం జిల్లా)

ప్రేమ పేరుతో గిరిజన బాలికను నమ్మించి.. ఓ ఆటోడ్రైవర్ తన మిత్రులతో కలిసి గురువారం రాత్రి గ్యాంగ్ రేప్ చేసిన ఘటన ప్రకాశం జిల్లా శింగరాయకొండ మండలం బింగినపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు.. బింగినపల్లి గిరిజన కాలనీకి చెందిన దంపతులు ఉపాధి నిమిత్తం హైదరాబాద్‌కు వెళ్లారు. తమ కుమార్తెను అమ్మమ్మ ఇంటి వద్ద విడిచి వెళ్లారు. అమ్మమ్మ, బాలిక కలిసి రోజూ కూలి పనులకు వెళ్లేవారు. అదే గ్రామానికి చెందిన ప్రతాప్ అనే ఆటో డ్రైవర్ ప్రేమ పేరుతో బాలిక వెంటపడేవాడు. ఆ నేపథ్యంలోనే గురువారం రాత్రి ఆ బాలికకు ప్రతాప్ ఫోన్ చేశాడు. మాట్లాడాలని నమ్మించి, గ్రామ సచివాలయం వద్దకు తీసుకెళ్లాడు. తన మిత్రులైన వలంటీర్ హరి, రామారావులను కూడా సచివాలయం వద్ద ఉన్న డంపింగ్ యార్డు వద్దకు రావాలని ప్రతాప్ చెప్పాడు. బాలికను అక్కడికి తీసుకెళ్లి ముగ్గురూ గ్యాంగ్ రేప్ చేశారు. జరిగిన విషయాన్ని బాలిక తన కుటుంబ సభ్యులకు చెప్పారు. గ్రామ పెద్దలు విషయం తెలుసుకొని పోలీసులకు సమాచారమిచ్చారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ప్రతాప్, హరి, రామారావును అదుపులోకి తీసుకొని విచారణ చేస్తున్నారు.

ప్రభుత్వ అధికారులతో సమన్వయం

- తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మాన్సూన్ పెట్రోలింగ్
- దక్షిణ మధ్య రైల్వే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

'మిచాంగ్' సైక్లోనిక్ తుపాను పరిస్థితులను ఎదుర్కోవడానికి నిరంతరం రాష్ట్ర ప్రభుత్వ అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనిచేయాలని రైల్వే అధికారులకు దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజరు ఆర్ ధనుంజయులు సూచించారు. తుపాను నేపథ్యంలో రైల్వేశాఖ తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విజయవాడ, గుంటూరు, గుంతకల్ రైల్వే డివిజన్ల వివిధ విభాగాల ప్రిన్సిపల్ హెడ్స్‌తో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మాన్సూన్ పెట్రోలింగ్ చేపట్టాలన్నారు. బ్రిడ్జిల కింద, ఇబ్బందికరమైన రోడ్లలో వాచ్‌మెన్‌లను నియమించాలని, నిలిచిపోయిన నీటిని పంపింగ్ చేయడానికి డీజిల్ పంపులను ముందుగా అమర్చాలని అన్నారు. బలహీనమైన వంతెనలు, ప్రదేశాల్లో అధికారులందరూ నైట్‌పుట్ ప్లేటింగ్‌ను మరింత ముమ్మరం చేయాలన్నారు. తుపాను ప్రభావిత సెక్షన్లలో నడపాల్సిన రైలు సర్వీసులను మార్చే అవకాశం ఉందని, పరిస్థితులను బట్టి కొన్ని రైళ్ల దారి మళ్లించే అవకాశాలు ఉంటాయన్నారు.

టిడిపివి దుష్ప్రచారాలు

- మంత్రి మేరుగ నాగార్జున

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాజకీయ మనుగడ ఉండదని టిడిపి దుష్ప్రచారాలు చేస్తోందని, వాటిని ఆపకపోతే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీల కోసం సామాజిక విప్లవానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని అన్నారు. విద్య, వైద్య రంగాల్లో కార్పొరేట్ సంస్థలకు మించి పేద ప్రజలకు సేవలు అందిస్తున్నామన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు. అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరారెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

సచివాలయాల్లో అసైన్డ్ భూముల జాబితా ఉంచాలి

- అడిషనల్ సిసిఎల్ఎకు వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అసైన్డ్ భూముల యజమానుల జాబితాను గ్రామ, వార్డు సచివాలయాల్లో బహిరంగ పరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. మంగళగిరిలోని సిసిఎల్ఎ కార్యాలయంలో అడిషనల్ సిసిఎల్ఎ ఎమ్‌డి ఇంతియాజ్‌కు శుక్రవారం కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు, కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి వినతిపత్రం సమర్పించారు. అన్యాక్రాంతమైన అసైన్డ్ భూములను తిరిగి లబ్ధిదారులకు లేదా వారి వారసులకు ఇవ్వాలని, సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా హక్కులు కల్పించాలని కోరారు. పేదల సాగులోని భూములకు, ఇళ్ల స్థలాలకు పట్టాలివ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

ఎపి, తెలంగాణ సిఎస్‌లతో


- నేడు కేంద్ర జలవనరుల కార్యదర్శి సమీక్ష

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణా జలాల పంపకం, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టు నిర్వహణ, కృష్ణానదీ యాజమాన్య బోర్డు ఆధ్వర్యంలో నిర్వహణపై ఎపి, తెలంగాణ రాష్ట్రాల సిఎస్‌లు, ఉన్నతాధికారులతో శనివారం ఉదయం 11 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కేంద్ర జలవనరులశాఖ కార్యదర్శి సమావేశం నిర్వహించనున్నారు. సాగర్‌పై ఇరు రాష్ట్రాల మధ్య నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసింది.

తుపానును సమర్థవంతంగా ఎదుర్కోవాలి

- కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ
- సన్నద్ధంగా ఉన్నామన్న సిఎస్
- జిల్లా స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు



తుఫాను కదలికకు సంబంధించి భారత వాతావరణ విభాగం (ఐఎండి) శుక్రవారం మధ్యాహ్నం విడుదల చేసిన శాటిలైట్ చిత్రం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారనుందని, సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు కేంద్ర కేబినెట్ కార్యదర్శి రాజీవ్ గౌబ ఆదేశించారు. ఎన్‌డిఆర్‌ఎఫ్, కోస్ట్ గార్డు, నేవీ, ఎయిర్‌ఫోర్స్, టెలికాం కేంద్ర ప్రభుత్వ శాఖలు, ఏజెన్సీలు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయంతో ఉండి వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆయన ఆదేశించారు. తుపాను ముందస్తు జాగ్రత్తలపై శుక్రవారం ఢిల్లీ నుంచి ఎపి, తమిళనాడు, పుదుచ్చేరి, ఒడిశా సిఎస్‌లతో రాజీవ్ గౌబ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ కెఎస్ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర, జిల్లా స్థాయిలో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశామన్నారు. కలెక్టర్లను పూర్తి అప్రమత్తం చేశామని, వాతావరణశాఖ అంచనా ప్రకారం అల్పపీడనం తుపానుగా రానున్న రెండు రోజుల్లో మారనుందని, దాని ప్రభావంతో దక్షిణ కోస్తా జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, మిగిలిన కోస్తా జిల్లాల్లో ఒక మాదిరి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. ఈ నెల 4న చెన్నై- మచిలీపట్నంల మధ్య తుపాను తీరం దాటే అవకాశముందని, ఆ సమయంలో 80 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందని పేర్కొన్నారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు : సిఎస్

తుపాను నేపథ్యంలో ఈ నెల 2 నుంచి మత్స్యకారులు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లొద్దని సిఎస్ జవహర్‌రెడ్డి పేర్కొన్నారు. తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు వీలుగా రెండు ఎన్‌డిఆర్‌ఎఫ్, 6 ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచామని తెలిపారు. అలాగే పౌరసరఫరాలశాఖ విభాగం ద్వారా వివిధ రకాల నిత్యావసర సరుకులను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచుతున్నట్లు వెల్లడించారు. నీటిపారుదల, ఆర్‌అండ్‌బి, పంచాయతీరాజ్ శాఖలను పూర్తిగా అప్రమత్తం చేసి బలహీనంగా ఉన్న వివిధ ఏటి గట్లు, వంతెనల పాయింట్లలో ప్రత్యేక ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రక్షిత మంచినీటి సరఫరా, విద్యుత్తు, టెలికాం, మున్సిపల్, వైద్యారోగ్యశాఖల అధికారులనూ అప్రమత్తం చేసినట్లు కేంద్ర కేబినెట్ కార్యదర్శికి సిఎస్ వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి, రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి సాయి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర సాయం కోసం ఫోన్ నెంబర్లు

తుపాను నేపథ్యంలో వాతావరణ సమాచారం కోసం 24 గంటలు అందుబాటులో ఉండేలా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రజల అత్యవసర సహాయం కోసం కంట్రోల్ రూమ్ నెంబర్లు 18004250101, 1070, 112ను సంప్రదించాలన్నారు. రైతులు వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



గవర్నరుకు వినతిపత్రం అందజేస్తున్న రుద్రరాజు

450 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలి

గవర్నర్‌కు పిసిసి వినతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కరువు రక్కసి విలయతాండవం చేస్తోందని, సగానికి పైగా మండలాలు కరువు కోరల్లో చిక్కుకున్నాయని పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు అన్నారు. కరువు పరిస్థితులపై గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలీ, వర్కింగ్ ప్రెసిడెంట్ సుంకరి పద్మశ్రీ, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు జెట్టి గురునాథంతో కలిసి శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 450 మండలాల్లో కరువు ఉందని. అన్నిటినీ కరువు మండలాలుగా ప్రకటించాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న రైతులను ఆర్థికంగా ఆదుకునేందుకు కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున ఆర్థికసాయం అందించాలన్నారు. నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల చొప్పున నష్టపరిహారం అందజేయాలన్నారు. కరువు మండలాల్లో ఉపాధి హామీ పథకాన్ని 100 రోజులు పొడిగించాలని, అందరికీ జాబ్‌కార్డులు ఇవ్వాలని కోరారు.

రాబోయే ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పశువులకు మేత, నీటినిల్వ విధానంపై ప్రణాళిక సిద్ధం చేయించేలా ప్రభుత్వానికి సూచించాలని కోరారు.

డ్రైవరు సుబ్రమణ్యం హత్య కేసును సిబిఐకి అప్పగింతకు హైకోర్టు నిరాకరణ

- సింగిల్ జడ్జి తీర్పును సమర్థించిన డివిజన్ బెంచ్
- సుబ్రమణ్యం తల్లిదండ్రుల అప్పీల్ కొట్టివేత

ప్రజాశక్తి-అమరావతి

డ్రైవరు సుబ్రమణ్యం హత్య కేసు దర్యాప్తును సిబిఐకి అప్పగించాలని కోరుతూ ఆయన తల్లిదండ్రులు దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు డివిజన్ బెంచ్ డిస్మిస్ చేసింది. సిబిఐ దర్యాప్తునకు ఉత్తర్వుల జారీకి గతంలో సింగిల్ జడ్జి నిరాకరిస్తూ ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఈ మేరకు జస్టిస్ యు దుర్గాప్రసాదరావు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయితో కూడిన డివిజన్ బెంచ్ శుక్రవారం తీర్పు చెప్పింది.

తన కుమారుడి హత్య వెనుక వైసిపి ఎమ్మెల్సీ అనంతబాబుపై కాకినాడ జిల్లా సర్పవరం పోలీసులు నమోదు చేసిన కేసు విచారణను సిబిఐకి అప్పగించాలంటూ మృతుడు డ్రైవరు సుబ్రమణ్యం తల్లిదండ్రులు వీధి నూకరత్నం, సత్యనారాయణ దాఖలు చేసిన పిటిషన్‌ను గతంలో సింగిల్ జడ్జి కొట్టివేశారు. ఆ తీర్పును సవాల్ చేసిన అప్పీల్ పిటిషన్‌ను డివిజన్ బెంచ్ కూడా కొట్టివేసింది.

సిసిటివి ఫుటేజ్‌లోని ఇతర వ్యక్తుల పాత్ర గురించి దర్యాప్తు అధికారులు పట్టించుకోలేదని, హత్య జరిగిన ఘటనా స్థలంలో రక్త నమూనాలను కూడా సేకరించలేదని పిటిషనరు తరపున న్యాయవాది జాడ శ్రవణ్‌కుమార్ వాదించారు. పోలీసుల తరపున ప్రభుత్వ న్యాయవాది మహేశ్వరరెడ్డి ప్రతివాదన చేస్తూ, ఆర్‌ఎఫ్‌ఎస్‌ఎల్ నివేదికలో ఇతరుల పాత్ర నిర్ధారణ కాలేదని చెప్పారు. వాదనల తర్వాత అప్పీల్ పిటిషన్‌ను కొట్టేస్తూ హైకోర్టు తీర్పు చెప్పింది.

కుల గణనకు జోరుగా సన్నాహాలు

- తొమ్మిది నుండి ఇంటింటికి
- నెలాఖరుకు ప్రక్రియ పూర్తి
- ఉత్తర్వులు జారీ

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కుల గణనకు రాష్ట్ర ప్రభుత్వం జోరుగా సన్నాహాలు చేస్తోంది. తొమ్మిదవ తేది నుండి ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరించే ప్రక్రియను ప్రారంభించి, నెలాఖరుకు పూర్తిచేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రణాళిక శాఖ ప్రణాళికశాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీచేసింది. దీనిలోనే ఎన్యూమరేటర్లకు శిక్షణ, ఇతర నిర్వహణ అంశాలను పొందుపరిచింది. ఈ ఉత్తర్వుల ప్రకారం ఐదో తేదీలోగా గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బందితో పాటు ఈ ప్రక్రియలో పాల్గొనే ఇతరులకు శిక్షణ పూర్తి చేయనున్నారు. ఆరో తేదీలోగా ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్ల జాబితా ఖరారు చేయనున్నారు. వీరికి

ఎనిమిదో తేదీలోగా పోస్టింగ్‌లు ఇవ్వాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తొమ్మిదో తేదీ నుంచి ఇంటింటికీ వెళ్లి గణనను నిర్వహించనున్నారు. ఈ ప్రక్రియ 18వ తేదీకి పూర్తికానుంది. ఆ సమయంలో అందుబాటులో లేని వారి కోసం 19వ తేదీ నుంచి 23వ తేదీ వరకు గడువునిచ్చారు. ఎన్యూమరేషన్ సిబ్బంది మరోసారి వారి వివరాలు సేకరించేందుకు ప్రయత్నిస్తారు. నెలాఖరులో సేకరించిన సమాచారాన్ని గ్రామ, వార్డు సచివాయాల శాఖ క్రోడీకరించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. .

ఎన్యూమరేటర్లకు వాలంటీర్ల సాయం ...

ఎన్యూమరేటర్లు తమకు కేటాయించిన ప్రాంతాల్లో ముందుగానే రూట్‌మ్యాప్‌లు తయారుచేసుకోవాలని, దీనికోసం వాలంటీర్ల సాయం తీసుకోవాలని ఉత్తర్వులలో పేర్కొన్నారు. ఈ సమయంలోనే కొత్తగా నిర్మాణమైన ఇళ్లలో, అభివృద్ధికి నోచుకోని ప్రాంతాల్లో ఉంటున్న వారి వివరాల సేకరణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. ప్రజలను అడగాల్సిన, ప్రజల నుంచి తరచూ వ్యక్తమయ్యే అనుమానాలను నివృత్తి చేసేందుకు తెలుగులో వివరాలు సిద్ధంచేయాలని ఉత్తర్వుల్లో సూచించారు.

వృద్ధాశ్రమాల్లోనూ సర్వే

కుల గణన సమయంలో ఏ ప్రాంతాన్ని కూడా వదలకూడదని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ప్రధానంగా ఇళ్లకు దూరంగా హాస్టళ్లలో ఉంటున్న వారి వివరాలతోపాటు వృద్ధాశ్రమాల్లో ఉంటున్న వారి వివరాలను కూడా సేకరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సేకరణ సమయంలో పలుమార్లు నమోదు సమస్య రాకుండా వారి నుంచి ఆధార్ వివరాలతో సహా నమోదు చేయాలని పేర్కొన్నారు.

నెట్‌వర్క్ అందుబాటులో లేని మారుమూల, గిరిజన ప్రాంతాల్లో ఆఫ్‌లైన్ ద్వారా గణన నిర్వహించనున్నారు. క్షేత్రస్థాయిలో గణన నిర్వహించేవారికి జిల్లా స్థాయి మానటరింగ్ కమిటీలు, హెల్ప్ డెస్క్‌లు సాయంగా ఉంటాయని ఉత్తర్వుల్లో పేర్కొనారు.

ఐఆర్ఆర్ కేసు విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్పులు చేసి లబ్ధి పొందారంటూ సిఐడి నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ టిడిపి అధినేత నారా చంద్రబాబు నాయుడు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు విచారణ ఈ నెల 6కు వాయిదా వేసింది. ఈ మేరకు జస్టిస్ టి మల్లికార్జునరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజధాని అమరావతి మాస్టర్ ప్లాన్ డిజైన్లతోపాటు ఇన్నర్ రింగ్ రోడ్డు అలైన్మెంట్లను మార్పులు చేయడం ద్వారా అక్రమాలకు తెరతీశారంటూ మంగళగిరి వైసిపి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి చేసిన ఫిర్యాదు మేరకు సిఐడి 2022 మే 9న కేసు నమోదు చేసింది. ఐపిసి సెక్షన్ 120(బి), 420, 166,167, 217, అవినీతి నిరోధక చట్టం సెక్షన్ 13(2), 13(1) (ఎ) తదితర సెక్షన్ల కింద నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని చంద్రబాబు హైకోర్టును ఆశ్రయించారు. సిఐడి తరపున అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్.. కేసుకు చెందిన ప్రాథమిక వివరాలను హైకోర్టుకు నివేదించారు. సిఐడి తరపున అదనపు పిపి దుష్యంత్ రెడ్డి విచారణను వాయిదా వేయాలని కోరడంతో హైకోర్టు అనుమతించింది. ఇప్పటికే చంద్రబాబు తరపున వాదనలు ముగిశాయి.

గన్నవరం ఎయిర్‌పోర్టులో..చంద్రబాబుకు ఘనస్వాగతం

ప్రజాశక్తి-గన్నవరం (కృష్ణా జిల్లా)/ తిరుమల

తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం వద్ద ఘన స్వాగతం లభించింది. తిరుపతి నుంచి గన్నవరం ఎయిర్‌పోర్టుకు శుక్రవారం ఒంటి గంటకు చేరుకున్నారు. విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్సీ అనురాధ, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు, టిడిపి కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఉండవల్లిలోని తన నివాసానికి బయలుదేరిన చంద్రబాబును పార్టీ శ్రేణులు భారీ ర్యాలీతో అనుసరించారు. టిడిపి నేతలు, కార్యకర్తలు వేలాదిగా తరలిరావడంతో జాతీయ రహదారి కిటకిటలాడింది. ఎయిర్‌పోర్టు నుంచి కేసరపల్లి, గూడవల్లి, నిడమానూరు, ప్రసాదంపాడు, రామవరప్పాడు గ్రామాల ప్రజలు దారిపొడవునా రోడ్లపైకి వచ్చి స్వాగతం పలికారు. యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో 200 మంది బైక్ ర్యాలీ నిర్వహించారు.

శ్రీవారి సేవలో చంద్రబాబు

తెలుగు జాతి ప్రపంచలో నంబర్ వన్‌గా ఉండాలని, ఆ సంకల్పంతో పని చేస్తానని టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని


శ్రీవారిని దర్శించుకున్న చంద్రబాబునాయుడు, భువనేశ్వరి

చంద్రబాబు నాయుడు దంపతులు దర్శించుకున్నారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 2003 శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో అలిపిరి వద్ద తనకు ప్రమాదం జరిగినప్పుడు వెంకటేశ్వర స్వామి కాపాడారన్నారు. తాజాగా వచ్చిన కష్టం దూరమవ్వాలని మొక్కుకున్నానని, మొదటగా ఆయన దర్శనం చేసుకున్న తర్వాతే మిగతా కార్యక్రమాలు చేపట్టాలని అనుకున్నానని, కష్ట సమయంలో తనకు అండగా నిలిచిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. చంద్రబాబుతో పాటు మాజీ మంత్రులు పనబాక లక్ష్మి, అమరనాథరెడ్డి, తిరుపతి మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు ఉన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలి

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ


ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తి ఉత్పత్తి సామర్థ్యంతో నడపాలని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ, సిఐటియు సీనియర్ నాయకులు ఎన్.రామారావు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి 1023వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఆర్‌ఎంహెచ్‌పి, ఎసిఎస్,హెచ్‌ఆర్ డిపార్టుమెంట్లకు చెందిన కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు పెద్ద ఎత్తున పోరాడుతున్న నేపథ్యంలో ప్లాంట్‌ను అమ్మే సాహసం చేయలేక గొంతునులిమే కుట్రలకు మోడీ ప్రభుత్వం దిగుతోందన్నారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని తగ్గించి రోజు రోజుకూ ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. ఏడాదిన్నరగా బ్లాస్ట్ ఫర్నేస్ - 3ని మూతవేసిందని తెలిపారు. తక్షణమే దీన్ని తెరవకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. త్వరలో జరిగే పార్లమెంట్ సమావేశాల్లో స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను ఉపసంహరించుకోనున్నట్టు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో అన్ని కార్పొరేట్ సంస్థలకూ బ్యాంకుల రుణాలు రద్దు చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఉక్కు పరిశ్రమ రుణాలు ఏ పాటివని ప్రశ్నించారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు జె.రామకృష్ణ, వరసాల శ్రీనివాసరావు, సిహెచ్.సన్యాసిరావు, జి.జయ, బిఎన్.రాజు, డివి.శ్రీనివాస్, పాల్గొన్నారు.

ఎన్నికల సంగ్రామానికి 100 రోజులే

- జనసేన అధినేత పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో


మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జనసేన విస్తృతస్థాయి సమావేశంలో ప్రసంగిస్తున్న పవన్‌కల్యాణ్

రాష్ట్రంలో సాధారణ ఎన్నికలకు గడువు కేవలం 100 రోజులు మాత్రమే ఉందని, పొత్తు ధర్మం పాటించి ప్రజల్ని చైతన్యవంతం చేద్దామని పార్టీ శ్రేణులకు జనసేన పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. టిడిపికి వెనుక నడవడం లేదని, పక్కన నడుస్తున్నామని అన్నారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం పార్టీ విస్తృస్థాయి సమావేశం పవన్‌కల్యాణ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన, టిడిపి ప్రభుత్వాన్ని స్థాపించడం ఖాయమన్నారు. దేశంలోనే అత్యుత్తమ రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దుతామన్నారు. త్వరలో నియోజకవర్గ నాయకులు, ఇన్‌ఛార్జులతో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. టిడిపి ఆరు హామీలు, జనసేన షణ్ముఖ వ్యూహం కలిసే ముందుకు సాగుతామని వెల్లడించారు. తెలంగాణ రాజకీయాల్లో జనసేన ప్రస్థానం బలంగా కొనసాగుతుందన్నారు. తాము తీసుకున్న నిర్ణయాలను సందేహించే వారిని వైసిపి కోవర్టులుగానే భావిస్తామన్నారు. ఈ సమావేశంలో పిఎసి ఛైర్మన్ నాదెండ్ల మనోహర్, నాగబాబు పాల్గొన్నారు.

నీటి వివాదాలకు కారణం చంద్రబాబే

- రాష్ట్ర హక్కులను కాపాడేందుకే వెళ్లాం
- మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిడిపి అధినేత చంద్రబాబు హక్కులను పరిరక్షించడంలో విఫలమైనందునే తమ ప్రభుత్వం అనివార్య పరిస్థితుల్లో రాష్ట్ర హక్కుల కోసం నాగార్జున సాగర్ వద్దకు వెళ్లి రాష్ట్ర సరిహద్దులోని 13 స్పిల్‌వేలను స్వాధీనం చేసుకున్నామని జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. తాడేపల్లిలోని వైసిపి కేంద్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు రాష్ట్ర హక్కులను పూర్తిగా వదిలేసి తెలంగాణకు తాకట్టు పెట్టారని విమర్శించారు. రాష్ట్ర సరిహద్దులోకి వెళ్లాలన్నా తెలంగాణ అధికారుల అనుమతి తీసుకోవాలన్న పరిస్థితి నుంచి మన నీటిని విడుదల చేసుకునేలా మన స్పిల్‌వేలోని 13 వెంట్‌లను మన పరిధిలోకి తీసుకున్నామన్నారు. రాష్ట్రానికి తాగు, సాగునీటి హక్కులను పరిరక్షించేందుకు జగన్ ప్రభుత్వం ఈ చర్యలు తీసుకుందన్నారు. తమకు కేటాయించిన నీటిని మించి చుక్కనీరు అదనంగా తీసుకోబోమని, తెలంగాణ సమాజం కూడా అర్థం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి సంబంధించి నీటి హక్కులను కాపాడే అంశంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలమైతే.. జగన్ ప్రభుత్వం సక్సెస్ అయిందని, అందుకే ఇంత తీవ్రమైన అంశమైనా టిడిపి స్పందించలేదని విమర్శించారు.


ఎపి గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం

రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా మధుసూధనరాజు, కమ్మన్న

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ కళ్లేపల్లి మధుసూధనరాజు, పి.కమ్మన్న ఎంపికయ్యారు. విజయవాడలోని హోటల్ మేఘనలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డాక్టర్ కళ్లేపల్లి మధుసూధనరాజు తెలిపారు. రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్‌గా బిరం వెంకట రమణ, కోశాధికారిగా యం.ధనుంజేయులు, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్‌గా ఐవివి రామారావు, సహాయ కార్యదర్శిగా హెచ్.శ్రీనివాసులు ఎంపికయ్యారు.

ప్రాంతీయ అధ్యక్ష, కార్యదర్శులుగా సత్యంబాబు, కొండపల్లి భాస్కరరావు, సుంకర నాగేశ్వరరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర అధ్యక్షులుగా డాక్టర్ కళ్లేపల్లి మధుసూధనరాజు ఎన్నిక కావడం వరుసగా ఐదవసారి అన్నారు. ఈ కమిటీలో గ్రంథాలయ ఉద్యోగుల సమస్యలను తోటి ఉద్యోగ సంఘాలతో కలిసి సంయుక్తంగా పోరాడి విజయం సాధించాలని తీర్మానం చేసినట్లు తెలిపారు. ఈ సమావేశానికి 13 జిల్లాల గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘ నాయకులు పాల్గొన్నారు.


పాట్నా విమానాశ్రయంలో కార్మికులకు స్వాగతం పలుకుతున్న బీహార్ కార్మిక శాఖ మంత్రి సురేంద్ర రామ్

ఎయిమ్స్ నుంచి కార్మికుల డిశ్చార్జి

న్యూఢిల్లీ : సొరంగం నుంచి సురక్షితంగా బయటకు వచ్చిన 41 మంది కార్మికులను రిషికేశ్‌లోని ఎయిమ్స్ నుంచి గురువారం రాత్రి డిశ్చార్జ్ చేశారు. వీరికి ఎటువంటి ఆరోగ్య సమస్యలు లేవని వైద్యులు తెలిపారు. మరోవైపు 41 మంది కార్మికులను ఆసుపత్రిలో కలుసుకున్న నవయుగ ఇంజనీరింగ్ కంపెనీ ప్రతినిధులు వారికి పెయిడ్ లీవ్‌ల మొత్తంతోపాటు రూ.2 లక్షల చెక్కును అందించారు. డిశ్చార్జ్ అయిన కార్మికులు ప్రత్యేక బస్సుల ద్వారా ఢిల్లీ విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి వారి వారి స్వరాష్ట్రాలకు వెళతారు. బీహార్‌కు చెందిన ఐదుగురు కార్మికులు ఇండిగో 6ఇ విమానం ద్వారా పాట్నా విమానాశ్రయానికి శుక్రవారం చేరుకున్నారు. వీరికి విమానాశ్రయంలో బీహార్ కార్మిక శాఖ మంత్రి సురేంద్ర రామ్ స్వాగతం పలికి, పూలమాలలతో సత్కరించారు. బీహార్‌లోని రోహ్తాస్‌కు చెందిన సుశీల్ కుమార్ (30), బంకాకు చెందిన వీరేంద్ర కిష్కు (28), ముజఫర్‌పూర్‌కు చెందిన దీపక్ కుమార్ (22), భోజ్‌పూర్‌కు చెందిన సబా అహ్మద్ (33), సరన్ జిల్లాకు చెందిన సోను కుమార్ సాహ్ (29) విమానాశ్రయం నుంచి బీహార్ ప్రభుత్వం అందించిన పోలీసు ఎస్కార్ట్‌తో తమ స్వస్థలాలకు వెళ్లారు. జార్ఖండ్‌కు చెందిన 15 మంది కార్మికులు కూడా రాంచీ విమానాశ్రయానికి చేరుకున్నారు.

కేంద్రం గుప్పిట్లోకి 'సాగర్'

(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. నవంబర్ 28వ తేదికి ముందున్న ఏర్పాట్ల ప్రకారమే సాగర్ నీటిని విడుదల చేయాలని కేంద్రం తాజాగా చేసిన నిర్ణయానికి కూడా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఒప్పుకున్నాయి. మరో భారీ ప్రాజెక్టు శ్రీశైలంలో కూడా ఇదే రకమైన ఏర్పాట్లు చేయాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. సాగర్ డ్యామ్‌పైకి రాష్ట్ర పోలీసులు దూసుకెళ్లడం, 13వ గేటు వరకు స్వాధీనం చేసుకుని, కుడి కాలువకు నీటిని విడుదల చేయడంతో గురువారం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ హోమ్‌శాఖ శుక్రవారం రంగంలోకి దిగింది. రెండు రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులు, డిజిపిలతో కేంద్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెండు విడతలుగా సాగిన ఈ సమావేశాల్లో కూడా రెండు రాష్ట్రాలు పరస్పర ఆరోపణలు చేసుకున్నాయి. కేంద్రం చేసిన కొన్ని ప్రతిపాదనలకు చివరకు రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అంగీకరించాయి. వీటి ప్రకారం నీటి విడుదలకు సంబంధించి నవంబర్ 28వ తేదికి ముందున్న పరిస్థితులను పునర్ధురించాల్సి ఉంటుంది. దీనికి తెలంగాణతో పాటు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కూడా అంగీకారం తెలిపింది. డ్యామ్ నిర్వహణను పూర్తిస్థాయిలో కృష్ణానదీ యాజమాన్య బోర్డుకు అప్పగించాలని డ్యామ్‌కు ఇకనుండి సిఆర్‌పిఎఫ్ దళాలు రక్షణ కల్పిస్తాయంటూ చేసిన ప్రతిపాదనలకు కూడా ఇరు రాష్ట్రాలు అంగీకరించాయి. కెఆర్‌ఎంబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నియంత్రణలో పనిచేస్తుందన్న సంగతి తెలిసిందే. దీంతో కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలే కెఆర్‌ఎంబి నిర్ణయాలుగా మారనున్నాయి. అదే జరిగితే, స్థానిక ప్రజల అవసరాలు, ప్రాధాన్యతలకు కేంద్రం ఎలా స్పందిస్తుందన్నది ప్రశ్నార్థకమే. డ్యామ్‌పైకి వెళ్లడానికి ఏ రాష్ట్రానికి చెందిన అధికారులకైనా సిఆర్‌పిఎఫ్ అనుమతి తప్పనిసరిగా మారనుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి 900 మంది పోలీసులు, తెలంగాణానుండి 700 మంది పోలీసులు రెండు వైపుల మోహరించడంతో శుక్రవారం కూడా తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. డ్యామ్‌పైకి చొచ్చుకెళ్లిన ఆంధ్రప్రదేశ్ పోలీసులపై తెలంగాణ ప్రభుత్వం కేసులు నమోదు చేసింది. తెలంగాణ భూభాగంలోకి అక్రమంగా చొచ్చుకొచ్చారని, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించారని విజయపురి సౌత్ పోలీసులు చేసిన ఫిర్యాదుల మేరకు ఈ కేసులు నమోదుచేశారు.

నీటి విడుదలను ఆపండి- రాష్ట్రానికి కెఆర్‌ఎంబి లేఖ

నాగార్జున సాగర్ నుండి తక్షణం నీటి విడుదలను ఆపాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి కెఆర్‌ఎంబి లేఖ రాసింది. నాగార్జునసాగర్‌లో ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 15 టిఎంసీల నీటిలో రాష్ట్ర ప్రభుత్వం అక్టోబర్‌లో పెట్టిన 5 టిఎంసిల ఇండెంట్ మేరకు ఇప్పటికే 5.01 టిఎంసీలను ఆంధ్రప్రదేశ్ వాడుకుందని పేర్కొంది. జూన్‌దాకా వేసవి తాగునీటి అవసరాల మేరకు మిగిలిన 10 టిఎంసీల నీటిని జనవరిలో 5 టిఎంసీలు, మార్చి, లేదా ఏప్రిల్‌లో మరో ఐదు టిఎంసీల నీటిని విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గతంలో అంగీకరించిందని తెలిపింది.

సాగర్, శ్రీశైలంపై నేడు సమీక్ష

నాగార్జునసాగర్ డ్యామ్ వద్ద నెలకొన్న ఉద్రిక్తతల నేపథ్యంలో నెలకొన్న పరిస్థితులపై కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ శనివారం సమీక్షించనుంది. సాగర్‌తో పాటు శ్రీశైలం డ్యామ్‌ల వద్ద ఉన్న పరిస్థితులను కూడా ఈ సమావేశంలో సమీక్షించనున్నట్లు తెలిసింది. కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ కార్యదర్శి దేబశ్రీ ముఖర్జీ తెలంగాణా, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జలవనరులశాఖ ఉన్నతాధికారులతో కృష్ణానదీజలాల సమస్యను సమీక్షించనున్నారు.

సాగర్‌కు చేరుకున్న సిఆర్‌పిఎఫ్ బలగాలు

కేంద్ర హోం శాఖ నిర్ణయం మేరకు శుక్రవారం రాత్రి హైదరాబాద్ నుంచి నాగార్జునసాగర్ డ్యామ్ వద్దకు సిఆర్‌పిఎఫ్ బలగాలు చేరుకున్నాయి. డ్యామ్‌పై పహారాకాస్తున్నాయి. ఇరు రాష్ట్రాల పోలీసులను పంపించివేసి మొత్తం డ్యామ్ వద్ద భద్రతా, రక్షణ బాధ్యతలను సిఆర్‌పిఎఫ్‌కు అప్పగించాలని నిర్ణయించడంతో ఈ బలగాలు సాగర్‌కు చేరుకున్నాయి.

కొందరికే కందిపప్పు

• ఆరు నెలలుగా ఆగిన పంపిణీ • డిసెంబరులోనూ అరకొర కేటాయింపులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న రేషన్‌లో ఏ సరుకు ఏ నెల అందుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. రేషన్ కార్డుదారులకు ఆరు నెలలుగా నిలిపివేసిన రాయితీ కందిపప్పు ఎట్టకేలకు ఈనెల నుంచి మళ్లీ పంపిణీ చేస్తున్నా.. అదీ కొందరికి మాత్రమే అందుతుంది. జిల్లాలకు కందిపప్పు నిల్వలు అంతంతమాత్రమే రావడంతో, అందరికీ అందించే పరిస్థితి కనిపించడం లేదు. నిల్వలు తక్కువగా ఉండడంతో అర్బన్ ప్రాంతాలకు మాత్రమే సరఫరా చేస్తున్నామని అధికారులు చెప్తున్నారు. జూన్, జూలైలో పంపిణీ ఆగిన తర్వాత రెండు నెలలకు సంబంధించిన కందిపప్పును ఆగస్టు రేషన్‌తో కలిపి ఇస్తామని పౌరసరఫరాల మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు ప్రకటించినా, లబ్ధిదారులకు కందిపప్పు అందడం లేదు.

అరకొరగా కేటాయింపులు

మొబైల్ డిస్ట్రిబ్యూషన్ యూనిట్ (ఎండియు) వాహనాల ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 1,48,07,061 రేషన్ కార్డుదారులకు ప్రభుత్వం సరుకులను అందిస్తోంది. వీటి ద్వారా 4,31,48,684 మంది పేదలు లబ్ధి పొందుతున్నారు. కార్డుపై ఒక్కో కుటుంబానికి కేజీ చొప్పున ప్యాకెట్ల రూపంలో కంది పప్పు అందిస్తోంది. డిసెంబరు నెల రేషన్‌కు 14,469 మెట్రిక్ టన్నుల కందిపప్పు అవసరం కాగా, ప్రభుత్వం 2,951 టన్నులనే జిల్లాలకు కేటాయించింది. పంచదార కేటాయింపులు కూడా అరకొరగానే ఉన్నాయి. రేషన్ కార్డుపై అరకిలో చొప్పున పంచదార అందిస్తోంది. డిసెంబరుకు 7,404 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 6,563 మెట్రిక్ టన్నులను కేటాయించింది.



మొబైల్ డిస్ట్రిబ్యూషన్ వాహనం ద్వారా చేపడుతున్న సరుకుల పంపిణీ

బహిరంగ మార్కెట్‌లో పైపైకి ధరలు

ప్రజా పంపిణీ వ్యవస్థ (పిడిఎస్) ద్వారా పంపిణీ నిలిచిపోవడంతో, కందిపప్పు ధరలు క్రమేణా పెరగుతున్నాయి. ఆగస్టులో కేజీ కందిపప్పు రూ.152 ఉండగా అక్టోబరు నాటికి రూ రూ.160కు చేరింది. నవంబరు మొదటి వారంలో రూ.165 ఉండగా, ప్రస్తుతం రూ.170కు చేరింది.

టిటిడికి రూ.5 కోట్ల విద్యుత్ గాలిమర విరాళం

ప్రజాశక్తి -తిరుమల

టిటిడికి రూ.5 కోట్ల విలువైన 800 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే గాలిమరను ముంబైకి చెందిన విష్ విండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ విరాళంగా అందించింది. తిరుమల జిఎన్‌సి ప్రాంతంలో గాలిమర ఏర్పాట్లను శుక్రవారం ఉదయం టిటిడి ఇఇ ఎవి.ధర్మారెడ్డి, ఇంజనీరింగ్ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. ఎపిఎస్ఇబి నుండి అనుమతులు వచ్చిన తరువాత విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా ఇఒ ధర్మారెడ్డి మాట్లాడుతూ.. విద్యుత్ గాలిమర ద్వారా ఏడాదికి 18 లక్షల యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని, దీనివలన ప్రతి ఏడాది టిటిడికి రూ.కోటి వరకు ఆదా అవుతుందని తెలిపారు. ఇప్పటికే టిటిడి అవసరాలకు 15 సంవత్సరాల క్రితమే ఈ కంపెనీ వారు 1.03 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే రెండు గాలిమరలను ఏర్పాటు చేశారన్నారు. వీటి నిర్వహణ బాధ్యతను ఈ కంపెనీ వారే చూసుకుంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ఏర్పాటు చేస్తున్న 0.8 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే గాలిమర నిర్వహణను వీరే చూస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెఇఒ సదా భార్గవి, సిఇ నాగేశ్వరరావు, ఎస్ఈ -2 జగదీశ్వర్‌రెడ్డి, డిఇ ఎలక్ట్రికల్ రవిశంకర్‌రెడ్డి, ఇఇలు సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మెరుగైన పురోగతికి కేంద్ర సూచికలే గీటురాయి

• మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాల వల్ల జాతీయ స్థాయిలో రాష్ట్ర ప్రగతి గణనీయంగా వృద్ధి చెందిందని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు తెలిపారు. గుంటూరు కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. అభివృద్ధి సూచికలపై కేంద్ర ప్రభుత్వం కేటాయించే ర్యాంకులలో రాష్ట్రానికి గతం కంటే ఎంతో మెరుగైన స్థానం వచ్చిందని తెలిపారు. జిఎస్‌డిపిలో 2014-19 మధ్య రాష్ట్రం 16వ ర్యాంకులో ఉంటే, 2019 -23లో నాలుగో ర్యాంకులో ఉందన్నారు. తలసరి ఆదాయంలో నాలుగేళ్ల క్రితం వరకు 17 స్థానంలో ఉండగా... ప్రస్తుతం తొమ్మిదవ ర్యాంకులో ఉందని తెలిపారు. పారిశ్రామిక పురోగతిలో గత ప్రభుత్వంలో 3.2 శాతం ఉంటే ప్రస్తుతం 10.58కి పెరిగిందన్నారు. వ్యవసాయ అభివద్ధిలో టిడిపి హయాంలో మైనస్ 6.5 శాతం ఉంటే, తమ ప్రభుత్వంలో ప్లస్ 5.56 శాతంలో ఉందని తెలిపారు. గత నాలుగేళ్లలో వ్యవసాయ రంగంలో గణనీయమైన పురోగతి సాధించినట్లు వెల్లడించారు.

కదం తొక్కిన విద్యార్థులు

• విద్యారంగ సమస్యలపై చలో కలెక్టరేట్
• 23 మంది అరెస్టు- విడుదల

ప్రజాశక్తి - నెల్లూరు

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు కలెక్టరేట్ లోపలికి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. 23 మందిని అరెస్టు చేసి అనంతరం విడుదల చేశారు. అమ్మఒడి పథకం, విద్యాదీవెన, విద్యార్థుల వసతి బకాయిలు చెల్లించాలని, వసతి గృహాల్లో కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. తొలుత నెల్లూరులోని గాంధీబొమ్మ సెంటర్ నుంచి కలెక్టరేట్ వరకూ విద్యార్థులు భారీ ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనను అడ్డుకునేందుకు మహబూబ్‌ఖాన్ పార్కు సమీపంలో కలెక్టరేట్ ద్వారం వద్ద పోలీసులు భారీ స్థాయిలో మోహరించారు. దీంతో విద్యార్థులు తమ ప్రదర్శనను కలెక్టరేట్ ప్రధాన గేటు వైపుకు సాగించారు. విద్యార్థులు చేరుకునే సమయానికి పోలీసులు అక్కడికి చేరుకున్నారు. కలెక్టరేట్ లోపలికి వెళ్లేందుకు కొంతమంది విద్యార్థులు గేటు ఎక్కేందుకు ప్రయత్నించగా, మరికొంత మంది కలెక్టర్ కార్యాలయం రెండవ గేటు వైపు నుంచి వెళ్లేందుకు పరుగులు తీశారు. విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకునే క్రమంలో కలెక్టరేట్ ఎదుట ఉన్న బురదలో విద్యార్థులు పడిపోవడంతో కొంత మందికి స్వల్ప గాయాలయ్యాయి. సుమారు 23 మంది విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు మాట్లాడుతూ.. రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నరేళ్లు పూర్తి కావస్తున్నా...విద్యార్థులకు ఇచ్చిన హామీలను అమలు చేయలేదని విమర్శించారు. గురుకుల పాఠశాలలో ఖాళీలను భర్తీ చేయాలని, వార్డెన్ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ నాయకులను బలవంతంగా వాహనంలోకి ఎక్కిస్తున్న పోలీసులు

డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

టిటిడి విజిలెన్స్ పోలీసు సిబ్బంది కొట్టారన్న మనస్థాపంతో డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల మేరకు.. కర్నూలు జిల్లా హాలహర్వి మండలం సిద్ధాపురం గ్రామానికి చెందిన జితేంద్ర కుమార్(21) తిరుపతి లోని ఎస్‌వి ఆర్ట్స్ కళాశాలలో బికాం ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. కళాశాల హాస్టల్‌లోని పైపులైన్లు తొలగించారని హాస్టల్ సిబ్బంది టిటిడి విజిలెన్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. విజిలెన్స్ పోలీసులు జితేంద్ర కుమార్‌ను హెచ్చరించడంతో తీవ్ర మనస్థాపంతో హాస్టల్ నుంచి బయటకు వెళ్లి పాకాల సమీపంలో రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆస్పత్రికి తర లించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి మృతిపై విచారణ చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ

జితేంద్ర కుమార్ మరణానికి కారణమైన విజిలెన్స్ అధికారులు, ప్రిన్సిపల్ నారాయణమ్మను తక్షణమే అరెస్ట్ చేసి విధుల నుండి తొలగించాలని, విద్యార్థి మృతిపై విచారణ జరిపించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.మాధవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విజిలెన్స్ అధికారులు విద్యార్థులను ప్రతి రోజూ కొడుతున్నారని, ఈ విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లినా ఏ మాత్రం స్పందించలేదన్నారు.

ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు

• యువగళం బహిరంగ సభలో లోకేశ్

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రాబోతుందని, వచ్చిన ఐదేళ్లలో ప్రభుత్వ, ప్రయివేటు రంగంలో, స్వయం ఉపాధి ద్వారా 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళంలో భాగంగా ఆయన శుక్రవారం కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల్లో పాద యాత్ర చేశారు. తాళ్లరేవు మండలం చొల్లంగిపేట క్యాంప్ సైట్ నుంచి ప్రారంభమైన యాత్రకు టిడిపి, జనసేన నాయకులు స్వాగతం పలికారు. సర్పవరం జంక్షన్‌లో జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు.

ఎనిమిది నుంచి అంగన్‌వాడీల సమ్మె

• ఆ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరావమ్మ

ప్రజాశక్తి - గుంటూరు

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, తెలంగాణ కంటే అదనంగా వేతనాలు ఇస్తామన్న సిఎం హామీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి అంగన్‌వాడీలు సమ్మెలోకి వెళ్లనున్నట్లు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ తెలిపారు. గుంటూరు బ్రాడీపేటలోని సిఐటియు కార్యాలయంలో శుక్రవారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సుప్రీం తీర్పు ప్రకారం గ్రాట్యుటీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ అనేకమార్లు ఆందోళనలు చేసినా ప్రభుత్వంలో చలనం లేదన్నారు. సిఐటియు, ఐఎఫ్‌టియు, ఎఐటియుసి, అంగన్‌వాడీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో సమ్మెలోకి వెళుతున్నట్లు చెప్పారు. పేద గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అనేక సేవలు చేస్తున్న అంగన్‌వాడీల పట్ల చిన్నచూపు తగదన్నారు. కొత్త కొత్త యాప్‌లు తెచ్చి పనిభారం పెంచుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ అమలు చేయాలని సుప్రీంకోర్టు తీర్పు చెప్పినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఏజెన్సీ ప్రాంతాలు, మారుమూల ప్రాంతాల్లో 5600 మినీ సెంటర్లు ఉన్నాయని, వర్కర్సే హెల్పర్లుగా పనిచేస్తున్నారని చెప్పారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని డిమాండ్ చేశారు. అర్హులైన అంగన్‌వాడీ హెల్పర్లకు ప్రమోషన్లు ఇవ్వాలన్న జిఒ ఉన్నా కొన్ని చోట్ల రాజకీయ నాయకులు అడ్డుపడుతున్నారని విమర్శించారు. 35 సంవత్సరాల పాటు సేవలు అందించినా మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ, బాల సంజీవనిలో నాణ్యమైన ఆహారం సరఫరా చేయాలని కోరారు. మెనూ ఛార్జీలు పెంచాలని, సెంటర్ అద్దెలు, బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. చీఫ్ సెక్రటరీతో జరిగిన చర్చలలో పురోగతి లేదని, కావున నిర్దిష్టమైన హామీ ఇచ్చే వరకూ సమ్మె కొనసాగుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో యూనియన్ జిల్లా కార్యదర్శి పి.దీప్తి మనోజ, నగర కార్యదర్శి టి.రాధ, నగర అధ్యక్షులు కె.చిన్నవెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న జిజిహెచ్ మెస్ వర్కర్లు

కృష్ణా జలాల పంపిణీలో ప్రభుత్వం మొద్దునిద్ర

• మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి- తెనాలి (గుంటూరు జిల్లా)

కృష్ణా జలాల పంపిణీ విషయంలో ఇప్పటి వరకు మొద్దు నిద్రలో ఉన్న అసమర్థత ప్రభుత్వం ఇప్పుడే నిద్రలేచిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎద్దేవా చేశారు. గుంటూరు జిల్లా తెనాలిలోని టిడిపి కార్యాలయంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. నాగార్జునసాగర్‌లో మనకు 13 గేట్లు ఉన్నాయన్న సంగతి ప్రభుత్వా నికి ఇప్పుడు గుర్తొచ్చిందా? అని ప్రశ్నించారు. రైతాంగం నీళ్ల లేక క్రాప్ హాలిడే ప్రకటించినా, పంటలు ఎండిపోయిన పరిస్థితుల్లో ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపారు. పోలవరం జాతీయ ప్రాజెక్టు పూర్తి చేయడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కష్ణా జలాల పంపిణీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాల వలన నికర జలాలు కూడా నష్టపోయే ప్రమాదం ఉందని తెలిపారు. సమావేశంలో నాయకులు టి హరిప్రసాద్, జె.మహేష్, పెండ్యాల వెంకటరావు, కేసన కోటేశ్వరరావు పాల్గొన్నారు.



బోటులో అగ్ని ప్రమాదం

• 11 మంది మత్స్యకారులను రక్షించిన కోస్టుగార్డు సిబ్బంది
• ఐ.పోలవరం మండలం భైరవపాలెం తీరంలో ఘటన

ప్రజాశక్తి - తాళ్లరేవు, ఐ.పోలవరం

కాకినాడ తీరంలో చేపలవేట కోసం సముద్రంలోకి వెళ్లిన బోటు అగ్నిప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో 11 మంది మత్స్యకారులను కోస్టుగార్డు సిబ్బంది సురక్షితంగా రక్షించారు. ఈ ఘటన ఐ.పోలవరం మండలం భైరవపాలెం వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. మత్స్యకారులు, కోస్టుగార్డు సిబ్బంది తెలిపిన వివరాల మేరకు... కాకినాడకు చెందిన 11 మంది మత్స్యకారులు వీరబాబు, నారాయణ, పి.సత్యం, సిహెచ్.నాగూర్, పి.నూకరాజు, పి.తాతారావు, ఎ.రత్నరాజు, కె.సత్యనారాయణ, పి.సతీష్, పి.ధర్మారావు, డి.వీరాబాబు ఈ నెల 21 బోటులో చేపల వేటకు వెళ్లారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో శుక్రవారం వారు తిరుగు ప్రయాణమయ్యారు. బోటు ఐ.పోలవరం మండలం భైరవపాలెం సమీపంలో నడిసంద్రంలో ఉండగా గ్యాస్ సిలిండర్ పేలడంతో మంటలు వ్యాపించాయి. మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా అదుపులోకి రాలేదు. వెంటనే తోటి మత్స్యకారులకు, కోస్టుగార్డు సిబ్బందికి సమాచారమిచ్చారు.

బోటును పూర్తిగా మంటలు చుట్టుముట్టడంతో వారు సముద్రంలో దూకేశారు. సమాచారం అందుకున్నకోస్టుగార్డు సిబ్బంది హుటాహుటిన రంగంలోకి దిగారు. భైరవపాలెం వద్ద బోటును గుర్తించి, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టి సముద్రంలో దూకేసిన 11 మంది మత్స్యకారులను తాళ్లు, ట్యూబులు, లైఫ్‌జాకెట్ల సాయంతో రక్షించారు. మత్స్యకారులను కాకినాడ ఫిషింగ్ హార్బర్‌కు తరలించారు. ఈ ప్రమాదంలో బోటు పూర్తిగా దగ్ధమై సముద్రంలో మునిగిపోయింది. వేట కోసం వెళ్లే సమయంలో వంట కోసం గ్యాస్, ఇతర సామగ్రిని మత్స్యకారులు తీసుకెళ్తుంటారు. వేట విరామ సమయంలో వంట చేసుకుని భోజనం చేస్తారు. ఎప్పటిలానే అలా వెళ్లిన బోటులో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ ప్రమాదం సంభవించింది. సుమారు రూ.కోటికిపైగా నష్టం వాటిల్లింది. సురక్షితంగా ప్రాణాలతో బయటప డటంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

సంపాదకీయం

ఉపాధిపై నిర్లక్ష్యం

గ్రామీణ భారతావనికి జీవగర్రగా ఉన్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనునిత్యం కుయుక్తులు పన్నుతూనేవుంది. దేశమంతటా పల్లెసీమల్లో ఈ చట్టం కింద అమలౌవుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల తీరుతెన్నులపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్) 2013 సంవత్సరం తర్వాత ఆడిటింగ్ నిర్వహించింది లేదని మీడియాలో కథనాలు రావడం ఆందోళన కలిగిస్తోంది. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉపాధి చట్టానికి ఉరితాళ్లు పేనుతూ వస్తున్న మోడీ సర్కార్ బడ్జెట్‌లో కోతలు విధించడం, యాంత్రీకరణ పెంచడం, కాంట్రాక్టీకరణకు పచ్చజెండా ఊపడం వంటి అనేక కుట్రలకు తెరలేపింది. దీంతో బిజెపి ఏలుబడిలో ఉపాధి పనుల్లోనూ అవినీతి ఆక్టోపస్‌లా విస్తరిస్తోంది. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో అంటే డబుల్ ఇంజిన్ సర్కార్లున్నచోట ఈ అవినీతి జాడ్యం మరింతగా వేళ్లూనుకుంటోంది. గ్రామీణ ఉపాధిపై కాగ్ గనుక పనితీరు మదింపు (ఫెర్మార్మెన్స్ ఆడిటింగ్) నిర్వహిస్తే కేంద్ర ప్రభుత్వ నిరంకుశ చర్యలన్నీ వెలుగులోకి వస్తాయి. అందుకే ఫెర్మార్మెన్స్ ఆడిటింగ్ చేయనీయకుండా అటకెక్కించేశారన్న విమర్శలను కొట్టిపారేయడానికి వీల్లేదు.

గ్రామీణ ఉపాధి హామీ పథకంపై చివరిగా 2013లో ఫెర్మార్మెన్స్ ఆడిటింగ్ జరిగింది. బిజెపి అధికారంలోకి వచ్చాక ఈ పదేళ్లలో ఒక్కసారి కూడా ఫెర్మార్మెన్స్ ఆడిటింగ్ జరగ లేదు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై ఆయా రాష్ట్రాల్లో సామాజిక మదింపు (సోషల్ ఆడిటింగ్) నిర్వహిస్తారు. ఈ విషయంలో వందకు వంద శాతం ఆడిటింగ్ నిర్వహించి కేరళ అగ్రస్థానంలో నిలిచింది. కేవలం 6 రాష్ట్రాలు మాత్రమే 50 శాతం, అంతకు మించి ఆడిటింగ్ నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వం సకాలంలో నిధులు విడుదల చేయనందునే గ్రామీణ ఉపాధిపై సామాజిక మదింపు సాధ్యపడలేదన్నది రాష్ట్రాల వాదన. కాగ్ జాతీయ స్థాయిలో నిర్వహించే ఫెర్మార్మెన్స్ ఆడిటింగ్ దీనికి భిన్నమైనది. సాధారణ ఆడిటింగ్ అనేది కేవలం ఈ పథకంలోని లావాదేవీలకు మాత్రమే పరిమితమైనట్టిది. ఫెర్మార్మెన్స్ ఆడిట్ అనేది సమగ్ర మదింపు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కేటాయింపులు, పథకం అమలులో కేంద్ర విధానపర చర్యలు, వాటి పనితీరు కొలబద్ధగా సమగ్ర మదింపు ఉంటుంది. కేంద్రం సంబంధిత పథకం నిర్వహణలో ఏపాటి పనితీరును కనబర్చిందో ఫెర్మార్మెన్స్ ఆడిట్‌లో తేలితుంది. ఉపాధి పథకానికి గోతులు తవ్వుతున్న మోడీ సర్కార్‌కు సమగ్ర ఆడిటింగ్‌పై శ్రద్ధ ఎందుకుంటుంది? 2016లో మాత్రం రాష్ట్రాలు నిర్వహించిన సామాజిక మదింపు యూనిట్లను సమీక్షించే నిమిత్తం సాధారణ ఆడిట్‌కు కాగ్ ఉపాధి పథకాన్ని ఎంచుకుంది. ఆ మదింపు వివరాలు ఇప్పటికీ బయటకు రాలేదు. మోడీ సర్కార్ ఉపాధి హామీ పథకం పట్ల ఎంతటి కుట్ర సాగిస్తోందో దీనిబట్టే అర్థమవుతుంది. ఈ ఏడాది వర్షాకాల పార్లమెంటు సమావేశాల సందర్భంగా కాగ్ 12 నివేదికలు సమర్పించింది. వివిధ పథకాల్లో మోడీ సర్కార్ అవినీతి బండారాన్ని, అక్రమాల గుట్టును ఆ నివేదికలు రట్టు చేశాయి. మోడీ సర్కార్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ద్వారకా ఎక్స్‌ప్రెస్ వే ప్రాజెక్టు, ఆయుష్మాన్ భారత్ పథకాల్లోనూ రూ.కోట్ల మేర అవినీతి బాగోతాన్ని బట్టబయల్జేయడంతో కేంద్రాన్ని కాగ్ ఇబ్బందుల్లో నెట్టేసింది. దీంతో ఆగ్రహించిన మోడీ సర్కార్ సదరు ఆడిట్‌లో పాలుపంచుకున్న అధికారులపై బదిలీ వేటు వేసి కక్ష తీర్చుకుంది.

కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకమైన ఉపాధి హామీ పథకానికి చట్టం ప్రకారం పూర్తిస్థాయిలో నిధులు సమకూర్చాల్సిన బాధ్యత కేంద్రానిదే. క్షేత్రస్థాయిలో పనులను రాష్ట్రాలు పర్యవేక్షిస్తాయి. కానీ నిధుల విడుదలలో కేంద్రం అంతులేని నిర్లక్ష్యం చూపుతోంది. ఉపాధి కార్మికులకు ఇవ్వాల్సిన వేతనాలకు సంబంధించిన నిధులను కూడా ఇవ్వడం లేదు. 18 రాష్ట్రాలకు వేతన బకాయిలు చెల్లించాల్సివుందని గత ఆగస్టులో కేంద్ర ప్రభుత్వమే నిస్సిగ్గుగా పార్లమెంటుకు నివేదించింది. పశ్చిమ బెంగాల్‌కు రూ.2770 కోట్లు, రాజస్థాన్‌కు రూ.979 కోట్లుకు, బీహార్‌కు రూ.669 కోట్లు చొప్పున కేంద్రం నుంచి బకాయిలు రావాల్సివుంది. కానీ మోడీ సర్కార్ మీనమేషాలు లెక్కిస్తోంది. కోవిడ్ మహమ్మారి తర్వాత ఉపాధి హామీ పథకంపై ఆధారపడుతున్నవారి సంఖ్య అనేక రాష్ట్రాల్లో గణనీయంగా పెరిగింది. ఉపాధి హామీకి సమాధి కట్టాలని చూస్తున్న బిజెపిని ఇంటికి పంపితేనే గ్రామీణ భారతావనికి ఉపాధి భరోసా !

మహనీయుల మాట



ప్రజల చైతన్యంలో మనం నాటిన విత్తనాలు మొలకెత్తకుండా ఎల్లకాలం ఉండబోవు. సామాజిక క్రమాన్ని శత్రువులు నేరాలతోను, బల ప్రయోగంతోను అణచివేయలేరు. చరిత్ర మనది. ప్రజలే చరిత్ర నిర్మాతలు.

- సాల్వడార్ అలెండీ,
అమెరికా కుట్రలకు బలైన చిలీ అధ్యక్షుడు, కమ్యూనిస్టు నేత.

మారుతున్న 'అనంత' సాగు - అందని ప్రభుత్వ సాయం

విశ్లేషణ



వి. రాంభూపాల్

రాష్ట్రంలో అత్యంత కరువు జిల్లా అయిన అనంతపురం జిల్లాలో ఒకనాడు కొర్రలు, జొన్నలు లాంటి ఆహారధాన్యాలు మాత్రమే పండించారు. 1980 తర్వాత రాష్ట్రంలోకెల్లా అత్యధికంగా వేరుశనగ పంట సాగయింది. ఒక దశలో ఖరీఫ్‌లో సాగయిన మొత్తం భూమిలో 98 శాతం వేరుశనగ పంట మాత్రమే పండించే పరిస్థితి ఏర్పడింది. గత ఆరేడు సంవత్సరాలుగా ఉద్యానపంటల సాగు పెరిగి నేడు విభిన్న రకాల పండ్లు, పూలు పండిస్తూ అనంత జిల్లా...రాష్ట్ర పండ్లతోటల కేంద్రంగా మారింది. ఎడారి నుండి మంచు పర్వతాల వరకు ఎక్కడ ఏ పంటలు పండుతాయో వాటన్నింటినీ ఈ జిల్లాలో పండించేందుకు రైతులు ప్రయత్నిస్తున్నారు. ఈ మార్పులకు తోడుగా రైతులకు అండగా నిలవాల్సిన ప్రభుత్వాలు తమ విధానాల వల్ల ఆటంకాలు కలిగిస్తున్నాయి. రిలయన్స్, అదానీ, బిర్లా మోర్ లాంటి కార్పొరేట్ సంస్థలు ఇక్కడ పండుతున్న పండ్లు, కాయగూరలు, పూల కొనుగోలులోకి జొరబడి క్రమంగా తామే పంటలు సాగు చేయడానికి, కాంట్రాక్టు వ్యవసాయానికి సిద్ధమవుతున్నాయి.



జిల్లా రైతులు తమ స్వంత అనుభవంతో కొద్దిపాటి నీటి వనరులతో, పరిమితమైన ఆర్థిక శక్తితో వైవిధ్యంతో కూడిన పంటలు పండిస్తుంటే వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు దగా చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా జొరబడుతున్నాయి. రిలయన్స్, బిర్లా మోర్, వెజిటబుల్ బాస్కెట్, బిగ్ బాస్కెట్ లాంటి అనేక కంపెనీలు ముందస్తుగా పండ్లతోటల రైతులతో ఒప్పందాలు చేసుకుని, ఆ రైతులకు రుణాలు, పరుగు మందులు, పంట పర్యవేక్షణ లాంటి రూపాల్లో రైతులకు వల వేస్తున్నాయి. ప్రభుత్వం నుండి సహకారం లేకపోవడంతో రైతులు అనివార్యంగా ఈ కంపెనీల మీద ఆధారపడాల్సి వస్తోంది.

జిల్లా రైతులను ముంచిన వేరుశనగ

అనంతపురం జిల్లా భౌగోళిక విస్తీర్ణం 11,35,913 హెక్టార్లు. ఇందులో వ్యవసాయ సాగు భూమి 6,01,245 హెక్టార్లు. ఇందులో స్థిరీకరించబడిన ఆయకట్టు 18,302.07 హెక్టార్లు. మొత్తం సాగు భూమిలో కేవలం 3.04 శాతం భూమికి మాత్రమే సాగు నీటి వనరులున్నాయి. ఇక్కడ వ్యవసాయం అంటే మెట్ట వ్యవసాయమే. వర్షం మీద ఆధారపడి పంటలు పండే పరిస్థితి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో 1961-62లో 7,28,753 హెక్టార్లలో ఆహారధాన్యాల పంటలు సాగు కాగా, 1991-92 నాటికి 1,63,015 హెక్టార్లకు తగ్గి, 2021-22లో తిరిగి 2,52,568 హెక్టార్లకు పెరిగింది. 1961-62లో 1,94,840 హెక్టార్లలో సాగు అయిన వేరుశనగ పంట 2005-06 నాటికి 8,11,156 హెక్టార్లకు భారీగా పెరిగింది. ఖరీఫ్ సీజన్‌లో మొత్తం సాగు భూమిలో 98 శాతం వేరుశనగ పంట మాత్రమే సాగయ్యే పరిస్థితి ఏర్పడింది. 2006-07 నాటికి రాష్ట్రంలో మొత్తం వేరుశనగ పంట సాగులో ఒక్క అనంతపురంలోనే 50 శాతం సాగు అయ్యిందని ఎం.ఎస్.స్వామినాథన్ ఫౌండేషన్ 2010లో రిపోర్టు ఇచ్చింది. వేరుశనగ పంట సాగు పెరగడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి- జిల్లాలో సకాలంలో వర్షాలు రాకపోవడంతో ఆహార ధాన్యాల పంటలు పెద్ద ఎత్తున నష్టపోవడం. రెండు-హరిత విప్లవంలో భాగంగా దేశవ్యాప్తంగా ఆయిల్ పంటల సాగు పెంచాలనే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఈ జిల్లాలో పెద్ద ఎత్తున అమలు చేయడం. వేరుశనగ తప్ప ఇక్కడ ఏ పంటా పండదు అనేంతగా రైతుల మానసిక స్థితిని పాలకులు మార్చగలిగారు.

అయితే జిల్లా రైతులకు వేరుశనగ పంట సాగు తీవ్ర విషాదాన్ని నింపింది. 1998 తర్వాత నుండి సుమారు 10 వేల మందికి పైగా వేరుశనగ రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. లక్ష మందికి పైగా వ్యవసాయ కార్మిక కుటుంబాలు ప్రతి సంవత్సరం వలసలు వెళ్లే పరిస్థితి ఏర్పడింది. సకాలంలో వర్షాలు రాక పంట నష్టపోవడం, పంటలను కాపాడుకోవడానికి పెద్ద ఎత్తున బోర్లు వేయించి అప్పుల ఊబిలో కూరుకుపోవడం, పంట నష్టపరిహారం చెల్లింపుల్లో ప్రభుత్వాల తీవ్ర అలసత్వం, పెట్టుబడి ఖర్చులు పెరిగినంతగా గిట్టుబాటు ధర లేకపోవడం, కొత్త రకం తెగుళ్లు, తగ్గిన పంట దిగుబడులు ఇందుకు కారణాలు. 1972-73 సంవత్సరంలో వేరుశనగ హెక్టారుకు భారతదేశంలో 762 కేజీల దిగుబడి రాగా, ఆంధ్రప్రదేశ్‌లో 831, అనంతపురంలో 751 కేజీలు వచ్చింది. కానీ 2004-05 నాటికి దేశంలో హెక్టారుకు 1188 కేజీలు, రాష్ట్రంలో 760, అనంతపురంలో 516 కేజీలకు పడిపోయింది. 1991 తర్వాత పాలకుల విధానాల్లో వచ్చిన మార్పులు వేరుశనగ రైతులను తీవ్రంగా నష్టపరిచాయి. వేరుశనగ కొత్త విత్తనాల పరిశోధనలు నిలిపి వేయడం, ఎరువులు, పురుగు మందుల ధరలు పెంచడం, పంటలకు మద్దతు ధర అమలు చేయకపోవడం, విత్తనాల కొరత, ముఖ్యంగా పామాయిల్ పెద్ద ఎత్తున విదేశాల నుండి దిగుమతి చేసుకోవడంతో జిల్లా రైతాంగం తీవ్రంగా నష్టపోయింది. వీటిని నివారించి జిల్లా రైతాంగాన్ని శాశ్వతంగా ఆదుకోవడానికి ప్రభుత్వాలు నియమించిన నిపుణుల కమిటీల సిఫార్సులు ఏవీ అమలు కాకపోవడంతో రైతులు వేరుశనగ సాగు పట్ల తీవ్ర విముఖత చూపారు. గతంలో 20 లక్షల ఎకరాల్లో సాగు అయిన వేరుశనగ పంట 2022-23 (28-08-23) నాటికి 5 లక్షల ఎకరాల్లో మాత్రమే సాగు అయ్యింది.

ఉద్యానవన పంటలు

ఆహార పంటల సాగు తగ్గి వేరుశనగ సాగు పెరిగినట్లుగా ప్రస్తుతం జిల్లాలో ఉద్యానవన పంటల సాగు భారీగా పెరిగింది. వేరుశనగ పంట గిట్టుబాటు కాకపోవడంతో ఇతర పంటల వైపు రైతులు వెళ్లడం, హంద్రీ నీవా నీరు చెరువులకు చేరడం, గత పది సంవత్సరాల్లో ఏడు సంవత్సరాలు సకాలంలోనో, అకాలంలోనో కొద్దిమేరకు వర్షాలు రావడం, భూగర్భ జలాలు పెరగడం, ప్రభుత్వాలు ఎక్కువ మొత్తం సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు రైతులకు అందించడంతో ఉద్యాన పంటల సాగు పెరిగింది. ఎడారిలో పండే ఖర్జూరం మొదలు ఆధునికమైన డ్రాగన్ ఫ్రూట్స్ వరకు, చెండు పూల నుండి లిల్లీ పూల వరకు వివిధ రకాల పంటలు జిల్లాలో సాగవుతున్నాయి. ప్రస్తుతం 26 రకాల పండ్లు, 29 రకాల కాయగూరలు, 22 రకాల పూలు, 10 రకాల మసాలా దినుసులు పండిస్తున్నారు. ఇంతటి వైవిధ్యమైన పంటలను పండించడం వెనుక అందుబాటులోకి వచ్చిన తుంపర సేద్యం, కొద్దిపాటి నీటివనరులు ఒక కారణమైతే, చదువుకున్న రైతు కుటుంబాల పిల్లలు ఐ.టి లాంటి రంగాల్లో ఉపాధి పొంది ఈ పంటల పెట్టుబడికి సహాయపడడం మరో కారణం. 2018-19 సంవత్సరంలో రెండున్నర లక్షల ఎకరాల్లో పండ్ల తోటలు సాగు కాగా 32,37,667 మెట్రిక్ టన్నులు దిగుబడి వచ్చింది. ఈ సంవత్సరం నాలుగు లక్షల ముప్పై వేల ఎకరాల్లో పండ్లతోటలు సాగయ్యాయి. మామిడి విస్తారంగా పెరిగింది.

ఉద్యాన పంటల సాగుకు పెట్టుబడి ఖర్చులు ఎక్కువ. అందువల్ల రైతులను ప్రోత్సహించడానికి ప్రభుత్వాలు మొదట్లో అనేక రాయితీలు ఇచ్చాయి. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని నిలిపివేసింది. దీంతో రైతులపై అదనపు భారం పడింది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. దీనివల్ల దళారీల దయ మీద ఆధారపడి రైతులు తమ పంటలను అమ్ముకునే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ పండే పండ్లను ఢిల్లీ మార్కెట్‌కు తరలించి రైతులను ఆదుకుంటామని గత రెండు సంవత్సరాల క్రితం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక రైలును ఏర్పాటు చేసింది. ఒక్కసారి ఢిల్లీ వెళ్లిన రైలు ఆ తర్వాత అడ్రస్ లేకుండా పోయింది. మూన్నాళ్ల ముచ్చటగానే ముగిసింది.

డ్రిప్, స్ప్రింక్లర్లు

వేరుశనగ పంటల సాగు నుండి రైతులు ఉద్యానపంటలు, కాయగూరలు, మసాలా దినుసుల లాంటి పంటల వైపు మళ్లడంలో ప్రభుత్వాలు సబ్సిడీతో డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు చేయడం, ఉపాధి హామీ పథకం కింద చెట్ల పెంపకం చేర్చడం, కొన్ని స్వచ్ఛంద సంస్థల్లు పండ్ల మొక్కలను ఉచితంగా పంపిణీ చేయడం లాంటివి కీలక పరిణామాలు.

జిల్లాకు తుంపర సేద్యం (మైక్రో ఇరిగేషన్) కింద 2003-04 సంవత్సరంలో 5,001 మంది రైతులకు (8,787 హెక్టార్లకు) డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు కాగా, 2007-08లో 11,940 మంది రైతులకు (15,868.25 హెక్టార్లకు), 2017-18 నాటికి 18,677 మంది రైతులకు (22,717 హెక్టార్లకు) విస్తరించింది. ఇదే సంవత్సరాల్లో ప్రస్తుత సత్యసాయి జిల్లాను కూడా కలిపి చూస్తే 2003-04 సంవత్సరంలో 9,737 మంది రైతులు 17,468 హెక్టార్లు, 18,841 మంది రైతులు 23,695 హెక్టార్లు, 2017-18 నాటికి 29,720 మంది రైతులు 34,814 హెక్టార్లకు ఈ తుంపర సేద్యం విస్తరించింది.

ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం డ్రిప్, స్ప్రింక్లర్లు మంజూరు నిలిపివేయడంతో రైతులపై అదనపు భారం పడింది. 2022-23లో 11,061 మంది రైతులు 13,671 హెక్టార్లలో స్ప్రింక్లర్లతో సాగు చేయగా...2023-24 సంవత్సరంలో మరింతగా తగ్గి 6,827 మంది రైతులు 8,349 హెక్టార్లలో మాత్రమే తుంపర సేద్యం సాగు చేసే పరిస్థితి వచ్చింది. పండ్లతోటల సాగు మధ్యలో తుంపర సేద్యానికి ప్రభుత్వం సబ్సిడీ నిలిపివేయడం సాగు విస్తీర్ణం మీద, రైతుల ఆర్థిక పరిస్థితుల మీద తీవ్ర ప్రభావం పడింది.

కార్పొరేట్ కంపెనీల వల

జిల్లా రైతులు తమ స్వంత అనుభవంతో కొద్దిపాటి నీటి వనరులతో, పరిమితమైన ఆర్థిక శక్తితో వైవిధ్యంతో కూడిన పంటలు పండిస్తుంటే వారికి అండగా ఉండాల్సిన ప్రభుత్వాలు దగా చేస్తున్నాయి. కార్పొరేట్ కంపెనీలు ఎలాంటి చట్టబద్ధ అనుమతులు లేకుండా విచ్చలవిడిగా జొరబడుతున్నాయి. రిలయన్స్, బిర్లా మోర్, వెజిటబుల్ బాస్కెట్, బిగ్ బాస్కెట్ లాంటి అనేక కంపెనీలు ముందస్తుగా పండ్లతోటల రైతులతో ఒప్పందాలు చేసుకుని, ఆ రైతులకు రుణాలు, పురుగు మందులు, పంట పర్యవేక్షణ లాంటి రూపాల్లో రైతులకు వల వేస్తున్నాయి. ప్రభుత్వం నుండి సహకారం లేకపోవడంతో రైతులు అనివార్యంగా ఈ కంపెనీల మీద ఆధారపడాల్సి వస్తోంది. గార్ల దిన్నె, నార్పల, శింగనమల, బుక్కరాయ సముద్రం మండలాల్లో ఏ రోజుకారోజు కాయగూరలను రైతుల ద్వారా ఒక సెంటర్‌కు చేర్పించుకుని అక్కడే గ్రేడింగ్ చేసి మొదటి రకం వాటిని బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ లలో ఉన్న తమ మాల్స్‌కు పంపుతారు. అక్కడ వీరు కొనుగోలుదార్లకు ఎక్కువ ధరకు అమ్ముకుని లాభపడుతుండగా వాటిని సాగు చేసిన రైతులు మాత్రం దివాళా తీస్తున్నారు. రైతు ప్రభుత్వం అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవడానికి అవసరమైన చర్యలు చేపట్టడంలేదు.

వెనుకబడిన అనంతపురం జిల్లాలో వ్యవసాయ మార్పులకు అనుగుణంగా ప్రభుత్వాలు వ్యవసాయ శాఖలో నూతన పరిజ్ఞానం కలిగిన సిబ్బందిని నియమించడం, రైతులకు రుణ సదుపాయం, మార్కెట్ సౌకర్యం కల్పించడం చేపట్టాలి. అయితే కేంద్ర ప్రభుత్వం అనుసరించే కార్పొరేట్ విధానాలకు మద్దతు ఇస్తున్న రాష్ట్ర ప్రభుత్వం (ప్రధాన ప్రతిపక్షం సంగతి సరేసరి) రైతులను ఆదుకునే దిశగా కదలడం లేదు. ఇందుకు పంటల వారీగా నిర్దిష్ట డిమాండ్లతో రైతులు ఐక్య పోరాటాలు చేయడమే పరిష్కారం.

(వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు)

పశ్చిమ హిమాలయాల్లో ప్రాజెక్టులను సమీక్షించాలి

వ్యాఖ్య

ఉత్తరాఖండ్ లోని ఉత్తరకాశీ జిల్లాలో సిల్క్‌యారా సొరంగం కూలిపోవడంతో లోపల చిక్కుకుపోయిన 41 మంది కార్మికుల 17 రోజుల వ్యథాభరిత నిరీక్షణకు తెరపడింది. మొత్తంగా కార్మికులందరినీ క్షేమంగా బయటకు తీసుకువచ్చారు. వీరిలో ఎక్కువమంది వలస కార్మికులే. వీరిని కాపాడేందుకు పలు సంస్థలు, ప్రభుత్వ, ప్రైవేటు రంగ కంపెనీలు, విదేశీ నిపుణులు, సైన్యానికి చెందిన ఇంజనీర్లు, ఇతర రంగాల కార్మికులు, దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వైమానిక బలగాలు తీసుకువచ్చిన భారీ, సంక్లిష్టమైన యంత్రాలు, సొరంగాన్ని మూసివేసిన 60 మీటర్ల శిథిలాల గుట్టలు, వాటిని తవ్వేందుకు వివిధ రకాల్లో అనుసరించిన పద్ధతులు, అప్పటికప్పుడు తీసుకున్న అత్యవసర నిర్ణయాలు, ఇవన్నీ ఫలించి ఎట్టకేలకు వారిని రక్షించి బయటకు తీసుకువచ్చే బృహత్తర కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఒక్కొక్క కార్మికుడి కోసం ఒక్కో అంబులెన్సును మోహరించారు. ఇవన్నీ సొరంగం పక్కనే కార్మికుల కోసం ఎదురుచూస్తూ వరుసగా వేచి వున్నాయి. సొరంగం నుండి బయటకు తీసుకురాగానే అక్కడే ఏర్పాటు చేసిన ఫీల్డ్ ఆస్పత్రిలో ప్రాథమిక పరీక్షలు పూర్తయిన అనంతరం వారిని సమీపంలోని చినయాలిసర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి అవసరమైన ప్రత్యేక సదుపాయాలన్నింటినీ ఏర్పాటు చేశారు. ఒకవేళ ఏదైనా తీవ్ర గాయాన్ని లేదా అస్వస్థతను కార్మికులు ఎదుర్కొంటున్నట్లైతే వారి కోసం తీసుకున్న అపారమైన ముందస్తు జాగ్రత్తల్లో ఇవన్నీ పాక్షికమే. అయితే, గత కొద్ది రోజులుగా వారితో జరిపిన ఫోన్ సంభాషణలు, ఇతర రకాల కమ్యూనికేషన్ల ద్వారా వారందరూ బాగున్నారని, ఎలాంటి గాయాలు లేవని తేలింది. కానీ, అదే సమయంలో ఇదంతా కూడా ఒక రకంగా నాటకీయంగా తీసుకున్న చర్యలుగా కూడా కనిపిస్తున్నాయి. ప్రభుత్వాలు కార్మికుల ఆరోగ్యం, వారి భద్రత కోసం అపారమైన ప్రయత్నాలు చేపట్టాయని ప్రజలకు చూపించుకోవడం కోసం ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్ష ప్రసారం కూడా చేశారు. అనేకమంది కేంద్ర, రాష్ట్ర మంత్రులు సైతం సంఘటనా స్థలానికి విచ్చేశారు. ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి కూడా వివిధ సమయాల్లో సొరంగం వద్దకు వచ్చి పనులను పర్యవేక్షించారు.

అంతా సవ్యంగానే జరిగి, సంతోషకరమైన ఫలితమే వచ్చినందున అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే ప్రస్తుత సంతోషకరమైన వాతావరణాన్ని చూసి అంతా బాగానే వుంటుందని అన్ని స్థాయిల్లోని అధికారులు భావించకూడదు. సున్నితమైన హిమాలయ ప్రాంతంలో మౌలిక వసతులను అభివృద్ధి పరచడమన్నది ఓ వ్యాపారం మాదిరిగానో లేదా ఏదో సాధారణ పద్ధతిలోనో చేపట్టడానికి వీల్లేదని తెలుసుకోవాలి. ఈ సొరంగం కుప్పకూలడమన్నది పెను విషాదానికి దారి తీసే పరిస్థితే. అయితే సొరంగం మొదట్లోనే ఇది సంభవించింది కాబట్టి సరిపోయింది.



సహాయక కార్యకలాపాల సమయంలో, వివిధ సంస్థలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సొరంగ ప్రదేశంలోని నేల స్వభావం కారణంగా అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారీ ఆగర్ డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, ఆ చుట్టుపక్కల పర్వత ప్రాంతాల్లో నేల గట్టిగా లేకపోవడం వల్ల శిథిలాలు పడుతుండడాన్ని వారు గమనించారు. పైగా సొరంగం పైభాగం నుండి నిలువుగా కొండను తవ్వడంతో సహా భారీ యంత్రాలతో కార్యకలాపాలు నిర్వహించడం చాలా రిస్క్‌తో కూడినదే. ఎందుకంటే ఆ ప్రకంపనల ధాటికి మళ్లీ సొరంగం కూలిపోవడమో లేదా కొండచరియలు విరిగిపడడమో జరుగుతుందనే భయాందోళనలు కూడా సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈ కారణాలవల్లే ఈ ప్రాజెక్టును చేపట్టినప్పటి నుండి వివిధ రంగాల నిపుణులు, భూగర్భ శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల వారు అందరూ కూడా హెచ్చరిస్తూనే వచ్చారు. రోడ్లు వెడల్పు చేయడం, వాలును తగ్గించడం, పేలుళ్ళు, సొరంగాలు తవ్వడం, శిథిలాలను కిందనున్న నదుల్లోకి తోసివేయడం వంటి చర్యల వల్ల... సున్నితంగా, పెళుసుగా వుండే హిమాలయ పర్వత ప్రాంతంలో తలెత్తే ప్రమాదాల గురించి అపప్రమత్తం చేస్తూనే వున్నారు.

PEOPLE'S DEMOCRACY
THE WEEKLY PAPER OF THE COMMUNIST PARTY OF INDIA (MARXIST)

900 కిలోమీటర్ల పొడవైన చార్‌ధామ్ హైవే ప్రాజెక్టు నిర్మాణాన్ని ఆమోదించి, అమలు చేస్తున్న సమయంలో ఇదే తీరులో వివిధ సంస్థలు సమన్వయంతో కృషి చేస్తూ, వృత్తిపరమైన సామర్థ్యాలను, వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాలను గౌరవించాలని అందరూ భావిస్తారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే సిల్క్‌యారా సొరంగాన్ని నిర్మిస్తున్నారు. సహాయక కార్యకలాపాల సమయంలో, వివిధ సంస్థలకు చెందిన సాంకేతిక నిపుణులు, ఎన్‌డిఆర్‌ఎఫ్ సిబ్బంది సొరంగ ప్రదేశంలోని నేల స్వభావం కారణంగా అనేక రకాల ఇబ్బందులను ఎదుర్కొన్నారు. భారీ ఆగర్ డ్రిల్లింగ్ యంత్రం పనిచేస్తుండగా, ఆ చుట్టుపక్కల పర్వత ప్రాంతాల్లో నేల గట్టిగా లేకపోవడం వల్ల శిథిలాలు పడుతుండడాన్ని వారు గమనించారు. పైగా సొరంగం పైభాగం నుండి నిలువుగా కొండను తవ్వడంతో సహా భారీ యంత్రాలతో కార్యకలాపాలు నిర్వహించడం చాలా రిస్క్‌తో కూడినదే. ఎందుకంటే ఆ ప్రకంపనల ధాటికి మళ్లీ సొరంగం కూలిపోవడమో లేదా కొండచరియలు విరిగిపడడమో జరుగుతుందనే భయాందోళనలు కూడా సర్వత్రా వ్యక్తమయ్యాయి. ఈ కారణాలవల్లే ఈ ప్రాజెక్టును చేపట్టినప్పటి నుండి వివిధ రంగాల నిపుణులు, భూగర్భ శాస్త్రవేత్తలు, స్థానిక ప్రజలు, ప్రజా సంఘాల వారు అందరూ కూడా హెచ్చరిస్తూనే వచ్చారు. రోడ్లు వెడల్పు చేయడం, వాలును తగ్గించడం, పేలుళ్ళు, సొరంగాలు తవ్వడం, శిథిలాలను కిందనున్న నదుల్లోకి తోసివేయడం వంటి చర్యల వల్ల...సున్నితంగా, పెళుసుగా వుండే హిమాలయ పర్వత ప్రాంతంలో తలెత్తే ప్రమాదాల గురించి అపప్రమత్తం చేస్తూనే వున్నారు.

ఈ కారణాల వల్లనే పశ్చిమ హిమాలయాల్లో తరచుగా, తీవ్ర స్థాయిల్లో విపత్తులు సంభవిస్తున్నాయి. పదే పదే విరిగిపడే కొండ చరియల వల్ల హైవేకి తీవ్రంగా నష్టం వాటిల్లడమో లేక పూర్తిగా మూసుకుపోవడమో జరుగుతోంది. భయంకరమైన వరదలు సంభవిస్తున్నాయి. తపోవన్-విష్ణుగఢ్ జల విద్యుత్ ప్రాజెక్టు పూర్తిగా ధ్వంసమైంది. చార్‌ధామ్ సర్క్యూట్‌లో యాత్రా స్థలాలకు కీలకమైన గేట్‌వే అయిన జోషిమఠ్ పట్టణం కుంగిపోతోంది. ఇవన్నీ కూడా పేలవమైన ప్రణాళికల వల్ల, పైగా హిమాలయ ప్రాంతంలో భౌగోళిక, భౌగోళిక-సాంకేతికమైన సున్నిత పరిస్థితుల పట్ల ఆందోళన కొరవడడం వల్లనే సంభవిస్తున్నాయి. పర్యావరణ నిబంధనలను ఏ మాత్రం పట్టించుకోకపోవడం, ప్రాథమికంగా కొండలు, రోడ్లు, పట్టణాలు, యాత్రా స్థలాలు ఎంత మాత్రం భారం మోయగలవనే అంశాలను పట్టించుకోకపోవడం వల్లే ఇవి జరుగుతున్నాయి. పర్యావరణ ప్రభావ మదింపును నిర్వహించే బాధ్యత నుండి తప్పుకోవడానికే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా 900 కిలోమీటర్ల హైవే ప్రాజెక్టును 53 చిన్న చిన్న విభాగాలుగా విభజించిందనే విషయాన్ని ఎవరూ మర్చిపోలేరు. పైగా కూర్పులో అవకతవకలు జరగడంతో ప్రాజెక్టును పరిశీలించేందుకు సుప్రీంకోర్టు నియమించిన నిపుణుల కమిటీ అభిప్రాయాన్ని కూడా ఎవరూ మర్చిపోలేరు. చివరగా, హైవేని విస్తరించేందుకు సుప్రీంకోర్టు కూడా ఆమోదం ఇచ్చేలా ఒత్తిడి తెచ్చేందుకు జాతీయ భద్రత అనే ట్రంప్ కార్డును కూడా కేంద్రం ఉపయోగించింది.

తాజా ఘటన తర్వాత, పశ్చిమ హిమాలయాల్లో చేపట్టిన అన్ని మౌలిక వసతుల ప్రాజెక్టులపైన సమగ్రంగా, స్వతంత్రంగా సమీక్ష జరపాల్సిన ఆవశ్యకత ఎంతైనా వుంది. అన్ని యాత్రా స్థలాలు, హిల్ స్టేషన్లు, ఆ ప్రాంతంలోని ఇతర పట్టణాల కేరీయింగ్ కెపాసిటీ (భరించే సామర్థ్యం)ని కూడా సమీక్షించాల్సిన అవసరముంది. అన్ని నిర్మాణ పనులకు తగిన సాంకేతిక కోడ్‌లను అభివృద్ధి పరచాలి. ఈ నియమ నిబంధనలన్నీ సక్రమంగా అమలవుతున్నాయా లేదా అని పర్యవేక్షించేందుకు, వాటి అమలు జరిగేలా చూసేందుకు సమర్థవంతమైన యంత్రాంగాలను ఏర్పాటు చేయాల్సి వుంది. ఇటువంటి చర్యలు తీసుకోకపోతే, నిర్దేశించబడిన ఈ ప్రాంత అభివృద్ధి పెను విపత్తుకు కారణంగా మారిపోయే ప్రమాదముంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)

కవిత్వం



ఇక్కడ ...
హద్దుల్లేవులే నేస్తం!

గాజాలోని అల్లరి పిల్లల్లారా!
మీరు ప్రతి రోజూ నా కిటికీ వద్ద
అరుపులూ కేకలతో నన్ను విసిగించేవారు!
నా బాల్కనీలోని పూలకుండీని పగులగొట్టి
ఉన్న ఒక్క పువ్వునూ పట్టుకుపోయారు!
అప్పుడు చిరాకుపడ్డా..
ఇపుడు దయచేసి తిరిగి రండర్రా!
ఎంతైనా గోల చేసుకోండి!
అన్ని కుండీలు పగులగొట్టుకోండి,
అన్ని పూలూ తెంపుకుపోండర్రా!
మీరు తిరిగి రండి!
అంతే చాలు!
తిరిగి రండి!!

- ఖలీద్ జుమా
(పాలస్తీనా కవి)

మీ వ్యాసాలు 5000 క్యారెక్టర్లు లేదా 700 పదాలు వుండాలి.
పంపాల్సిన మెయిల్ :
editpageps@gmail.com

ఎన్నికల ఫలితాల తరువాత ఇండియా ఫోరం భేటీ

- భవిష్యత్ కార్యాచరణపై చర్చ
- సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి



కోయంబత్తూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న సీతారాం ఏచూరి

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని, దేశాన్ని రక్షించడానికి మెరుగైన ప్రభుత్వం అవసరమని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పేర్కొన్నారు. ఐదు రాష్ట్రాల్లో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన తరువాత ఇండియా బ్లాక్ నేతలంతా కలిసి కూర్చుని తమ భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నారని చెప్పారు. కోయంబత్తూరులో సిపిఎం శుక్రవారం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీతారాం ఏచూరి మాట్లాడారు. "ఇవి చాలా గట్టి పోటీ ఉన్న ఎన్నికలు కాబట్టి, ప్రధానమంత్రి, హోం మంత్రి, మొత్తం క్యాబినెట్ తీవ్రమైన ప్రచారం చేసినప్పటికీ బిజెపికి, ప్రధాని మోడీకి గెలుపు అంత తేలికైనది కాదు" అని అన్నారు. నిరుద్యోగిత రేటు రికార్డు స్థాయిలో పెరిగిపోయిందని, ప్రపంచ ఆహార సూచీలో భారత్ స్థానం మరింత దిగజారిందని, ప్రజాసంక్షేమం మంటగలిసిందని ఏచూరి విమర్శించారు. గత ఏడాది 40,000కు పైగా కార్పొరేట్ సంస్థలు ఆదాయపు పన్ను పరిధి నుంచి బయటికి వెళ్లాయని పేర్కొన్నారు. ఏప్రిల్ - సెప్టెంబర్ మధ్య కాలంలో వచ్చిన విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు గతేడాది ఇదే కాలంతో పోలిస్తే 77 శాతం తగ్గాయని పేర్కొన్నారు.

ఇండియా ఫోరమ్‌ను మరింత బలోపేతం చేసేందుకు సిపిఎం కట్టుబడి ఉందని చెప్పారు. ఈ ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి తన అసమర్థ పాలనకు ఫలితాన్ని చవిచూస్తుందని ఏచూరి అన్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ బిజెపి భారీ మూల్యాన్ని చెల్లించక తప్పదని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రభుత్వ మార్పు తప్పక జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. వచ్చే ఏడాది జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాజ్యాంగం ప్రకటించిన భారత దేశాన్ని కాపాడుకోవడం కోసం మెరుగైన ప్రభుత్వం ఏర్పాటు అవసరముందన్నారు. ఇండియా ఫోరమ్‌ను మరింత బలోపేతం చేసేందుకు సిపిఎం కట్టుబడి ఉంది" అని సీతారాం ఏచూరి అన్నారు. ఇండియా బ్లాక్ సమావేశాల్లో సీట్ల సర్దుబాటుకు సంబంధించిన అన్ని అంశాలు రాష్ట్రానికి సంబంధించినవిగా నిర్ణయించబడ్డాయని అన్నారు. "సాధారణ జనాభా గణనతోపాటు కుల గణన కూడా జరగాలని కోరుతున్నాం. ఇది సుదీర్ఘంగా ఉన్న అంశం" అని అన్నారు.

యునెస్కో, ఎగ్జిక్యూటివ్‌కు జరిగిన ఎన్నికలలో ఆసియా ప్రతినిధిగా పాకిస్తాన్‌కు 38 ఓట్లు రాగా, భారత్‌కు 18 ఓట్లు మాత్రమే వచ్చాయి. "గ్లోబల్ సౌత్‌కు నాయకులమైతే, ఇది ఎందుకు జరుగుతోంది? దీనికి సమాధానం చెప్పాలి" అని ఆయన డిమాండ్ చేశారు. యుఎస్ ఇటీవల చేసిన ఆరోపణ (ఖలిస్తాన్ వేర్పాటువాదులను చంపే పన్నాగంలో ఒక భారతీయ అధికారిని లింక్ చేయడం), యుఎస్ కోర్టులో సాక్ష్యాధారాలతో, వ్యక్తుల పేర్లతో దాఖలు చేసిన కేసుపై మోడీ ప్రభుత్వం స్పష్టంగా సమాధానం చెప్పాలని అన్నారు.

తమిళనాడు అభివృద్ధికి బిజెపి లేదా కమ్యూనిస్టు పార్టీలు ఏ పార్టీ ఎక్కువ సహకారం అందించిందో బహిరంగ చర్చకు రావాలని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు కె. అన్నామలైకి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కె. బాలకృష్ణన్ సవాల్ విసిరారు. అన్నాడిఎంకె ఎప్పుడూ బిజెపికి 'బి' టీమ్‌గా పని చేస్తుందని, ఇటీవల అసెంబ్లీ ప్రత్యేక సెషన్‌లో 10 బిల్లులు మళ్లీ ఆమోదించేటప్పుడు కూడా సభ నుండి వాకౌట్ చేసిందని ఆయన గుర్తు చేశారు. ఎంఎస్ఎంఇలు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యను సిపిఎం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిందని, దీనిపై ఆందోళన కొనసాగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిధులు, సాంకేతికత బదిలీ కీలకం

- కాప్ 28 సదస్సులో ప్రధాని మోడీ



కాప్ సదస్సుకు హాజరైన ప్రధాని మోడీ, వివిధ దేశాల నేతలు

దుబాయ్ : కర్బన ఉద్గారాలు తగ్గించుకోవాలంటే వర్ధమాన దేశాలకు టెక్నాలజీ బదిలీ చేయడంతోబాటు వాతావరణ విపత్తులను ఎదుర్కొనేందుకు అవసరమైన నిధులు వర్ధమాన దేశాలకు అందేలా చూడాలని ప్రధాని నరేంద్ర మోడీ సంపన్న దేశాలను కోరారు. వాతావరణ సమస్యలకు వర్ధమాన దేశాలు ఎంతమాత్రం కారణం కాదని, అయినా కూడా వారు సమస్య పరిష్కారంలో భాగస్వాములవడానికి సుముఖత వ్యక్తం చేస్తున్నారన్న విషయాన్ని గుర్తించాలని ఆయన అన్నారు. సమానత్వం, వాతావరణ న్యాయం, పరస్పరం పంచుకునే బాధ్యతలు, సామర్ధ్యాల ప్రాతిపదికన వాతావరణ కార్యాచరణ వుండాలని తాను విశ్వసిస్తానని చెప్పారు. ఈ సూత్రాలకు కట్టుబడి వుండడం ద్వారా సుస్థిరమైన భవిష్యత్ దిశగా ఒక బాటను ఏర్పాటు చేయగలమని, ఆ క్రమంలో ఎవరూ వెనుకబడిపోరని అన్నారు. ఈ క్రమంలో పేద, వర్ధమాన దేశాల అభివృద్ధి ప్రాధాన్యతలపై రాజీ పడరాదన్నారు.

దుబాయ్‌లో జరుగుతున్న కాప్ 28 సదస్సుకు హాజరైన మోడీ అక్కడి పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చారు. వాతావరణ మార్పులనేది సమిష్టిగా ఎదుర్కొనాల్సిన సవాలని తానెప్పుడూ చెబుతానని అన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఐక్య ప్రతిస్పందన ఒక్కటే దీనికి పరిష్కారమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పులపై చేపట్టే కార్యాచరణ గురించి పెరుగుతున్న ఆశలను వాతావరణ నిధులపై పురోగతిలో చూడాల్సి వుందని ఆయన పేర్కొన్నారు. సమర్ధవంతమైన, సమిష్టి వాతావరణ కార్యాచరణకు ఈ సదస్సు తాజా ఊపునివ్వగలదని భారత్ ఆశాభావంతో వుందని అన్నారు. యుఎన్‌ఎఫ్‌సిసిసి, పారిస్ ఒప్పందం లక్ష్యాలను మరింత ముందుకు తీసుకెళ్లడంలో అంతర్జాతీయ సహకారం కూడా పెరగగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. మరింత పచ్చదనంతో కూడిన, అలాగే సంక్షేమం సమృద్ధిగా వుండగల భవితవ్యం కోసం భారత్, యుఎఇలు భాగస్వాములుగా కృషి చేస్తాయన్నారు. వాతావరణ కార్యాచరణపై అంతర్జాతీయ కార్యకలాపాలను ప్రభావితం చేసేందుకు సంయుక్తంగా కృషి చేయడానికి కట్టుబడి వున్నామన్నారు.

భారత్-యుఎఇ సంబంధాలపై మాట్లాడుతూ, రెండు దేశాల మధ్య ఇప్పటికే మంచి పటిష్టమైన సంబంధాలు వున్నాయన్నారు. ఇంధన భద్రతను మరింత పెంచుకునేందుకు ఉమ్మడి గ్రిడ్‌ను ఏర్పాటు చేయడంలో చేతులు కలపనున్నట్లు చెప్పారు. గ్లోబల్ సోలార్ ఫెసిలిటీకి మద్దతునిస్తామని చెప్పారు.

2028లో భారత్ ఆతిథ్యం?

2028లో జరగబోయే కాప్ 33 వాతావరణ సదస్సుకు భారత్ ఆతిథ్యం ఇస్తుందని ప్రధాని మోడీ శుక్రవారం ప్రతిపాదించారు. ప్రజల ప్రాతినిధ్యం ద్వారా కార్బన్ సింక్‌లను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టే గ్రీన్ క్రెడిట్ ఇనీషియేటివ్‌ను ప్రారంభించారు. అభివృద్ధికి, పర్యావరణ సంరక్షణకు మధ్య సంతులనాన్ని పాటిస్తూ భారత్, ప్రపంచ దేశాలకు గొప్ప ఉదాహరణగా నిలిచిందని చెప్పారు. 2030 జూన్ కల్లా కాలుష్యాల తీవ్రతను 45శాతం తగ్గించాలని, శిలాజయేతర ఇంధనాల వాటాను 50శాతానికి పెంచాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. వాతావరణ మార్పులను ఎదుర్కొనేందుకు వర్ధమాన, పేద దేశాలకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానాన్ని బదిలీ చేయాల్సిన అవసరముందన్నారు.

4న మిజోరం ఓట్ల లెక్కింపు

- వాయిదా వేసిన ఇసి

న్యూఢిల్లీ : మిజోరం అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపును ఈ నెల 4వ తేదీకి వాయిదా వేసినట్లు ఎన్నికల సంఘం ప్రకటించింది. గతంలో జారీ చేసిన షెడ్యూల్ ప్రకారం ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఈ నెల మూడున ప్రకటించాల్సిఉంది. 40 అసెంబ్లీ స్థానాలున్న మిజోరం ఎన్నికల ఫలితాల వెల్లడిని వాయిదా వేయాలని ఆ రాష్ట్రం నుంచి అనేక విజ్ఞప్తులు వచ్చాయి. డిసెంబరు 3, ఆదివారం మిజోరం ప్రజలకు ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని, కాబట్టి ఫలితాల వెల్లడి తేదీని మార్పు చేయాలని అభ్యర్థించారు. దీంతో ఫలితాల వెల్లడి తేదీని డిసెంబరు 3 నుంచి డిసెంబరు 4కు వాయిదా వేస్తున్నట్లు శుక్రవారం ఒక ప్రకటనలో ఎన్నికల సంఘం తెలిపింది.

48 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

బెంగళూరు : కర్ణాటక రాజధాని బెంగళూరు, దాని చుట్టుపక్కల ఉన్న 48 పాఠశాలలకు శుక్రవారం ఇమెయిళ్ల ద్వారా బాంబు బెదిదింపులు వచ్చాయి. పాఠశాలల మైదానంలో పేలుళ్ల పదార్థాలు అమర్చామని ఇమెయిళ్లలో బెదిరించారు. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసిన పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులను ఇళ్లకు తీసుకుని వెళ్లాలని వారి తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశాయి. బాంబు గుర్తింపు బృందాలతో పాఠశాలలకు చేరుకున్న పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎక్కడా పేలుడు పదార్థాలను గుర్తించలేదు. దీంతో ఈ బెదిరింపులను బూటకంగా తేల్చారు. ఈ బెదిరింపులపై విచారణ కొనసాగిస్తామని చెప్పారు. ఈ బెదిరింపులపై ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తీవ్రంగా స్పందించారు. బెంగళూరులో భద్రత పెంచాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆందోళనకు గురికావద్దని విద్యార్థుల తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ఉపముఖ్యమంత్రి డికె శివకుమార్, హోం మంత్రి జి పరమేశ్వర బెదిరింపులపై స్పందించారు. పాఠశాలలను సందర్శించారు.

అమెరికాలో భారతీయ విద్యార్థిపై హింసాకాండ

వాషింగ్టన్: అమెరికాలో ఏడు నెలల నుంచి తీవ్ర హింసాకాండ అనుభవిస్తున్న ఒక భారతీయ విద్యార్థిని అక్కడ పోలీసులు రక్షించారు. విద్యార్థిని బంధించి మూడు ఇళ్లలో బలవంతంగా పనిచేయించారని, కనీసం బాత్రూమ్ సదుపాయం లేకుండా వేదనకు గురిచేశారని పోలీసులు గుర్తించారు. పివిసి పైపులతోనూ శారీరకంగా హింసించారు. మిస్సోరి రాష్ట్రంలోని సెయింట్ చార్లెస్ కౌంటీలో జరిగి ఈ దారుణానికి సంబంధించి పోలీసులు నిందితులు వెంకటేశ్ ఆర్ సత్తారు, నిఖిల్ వర్మ, శ్రావణ్ వర్మలను అరెస్టు చేశారు. వారిపై కిడ్నాప్, మానవ అక్రమ రవాణా, దాడి వంటి నేరాభియోగాలు మోపారు. ప్రస్తుతం బాధితుడిని రక్షించిన పోలీసులు.. ఆసుపత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు. ఈ విద్యార్థి మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో చదువుకునేందుకు ఎన్నో ఆశలతో గతేడాది అమెరికా వచ్చాడు. ఈ ఏప్రిల్ ఏప్రిల్‌లో విద్యార్థిని నిందితుడు వెంకటేశ్ ఆర్ సత్తారు తన ఇంటికి తీసుకువచ్చాడు. ఇక్కడి నుంచి వేధింపులు ప్రారంభమయ్యాయి. సత్తారు తన ఐటీ సంస్థతో పాటు అతడికున్న మూడు ఇళ్లలో కూడా పనులు చేయించేవాడు. గత ఏడు నెలలుగా అతడిని ఒక బేస్‌మెంట్‌లో బంధించారు. 911కి వచ్చిన ఫోన్ కాల్ ద్వారా పోలీసులు సత్తారు ఇంటికి వెళ్లి బాధిత విద్యార్థిని కాపాడారు.

మయన్మార్ మాజీ కల్నల్‌కి పదేళ్ల జైలు శిక్ష

నైఫిడో : గతంలో సమాచార మంత్రిగా, అధ్యక్ష ప్రతినిధిగా పనిచేసిన మాజీ ఆర్మీ అధికారి యే హ్టుట్ (64)ను దేశద్రోహం కేసులో దోషిగా కోర్టు నిర్ధారించింది. పదేళ్ల జైలు శిక్ష విధించింది. 2021లో ప్రజాస్వామ్య యుతంగా ఎన్నికైన అంగ్‌సాన్ సూకీ ప్రభుత్వాన్ని కూలదోసి జుంటా సైన్యం మయన్మార్ పాలనను చేజిక్కించుకున్న సంగతి తెలిసిందే.



నవ కేరళ సదస్సులకు భారీ ఆదరణ

తిరువనంతపురం : కేరళలో జరుగుతున్న నవ కేరళ సదస్సులకు భారీ ఆదరణ కొనసాగుతోంది. ఈ బహిరంగ సభలకు వేల సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారు. మలప్పురం జిల్లాలో శుక్రవారం జరిగిన సదస్సులో ముఖ్యమంత్రి పినరయి విజయన్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభించింది.

మళ్లీ మోడీ సర్కార్ బాదుడు

- కమర్షియల్ ఎల్‌పిజి ధర రూ.21 పెంపు

న్యూఢిల్లీ : ఐదు రాష్ట్రాల ఎన్నికలు కాగానే మోడీ సర్కార్ బాదేసింది. వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ ధరను పెంచి... భారత్‌లో విమానాలకు వాడే ఏవియేషన్ టర్బైన్ ఇంధన (ఏటీఎఫ్) ధర 4.6 శాతం తగ్గించింది. ఇది ఒకే నెలలో రెండో తగ్గింపు కావటం గమనార్హం. అయితే వాణిజ్య వంట గ్యాస్ (ఎల్‌పిజి) రేటు 19 కిలోల సిలిండర్‌కు రూ.21 పెరిగింది. గృహావసరాల ఎల్‌పిజి ధర (14.2 కిలోల సిలిండర్‌పై)లో ఎలాంటి మార్పు లేదు. చమురు సంస్థలు వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ధరను రూ. 21 మేర పెంచాయి. దీంతో దీని ప్రభావం హోటళ్లు, రెస్టారెంట్లు వంటి వాటిపై పడనున్నాయి. 19 కిలోల వాణిజ్య ఎల్‌పిజి సిలిండర్ ఇప్పుడు దేశ రాజధానిలో రూ. 1,796.50గా, వాణిజ్య రాజధాని ముంబయిలో రూ. 1,749గా ఉన్నది. చమురు సంస్థలు సవరించిన ధరల ప్రకారం.. ఎటిఎఫ్ ధర రూ.5,189.25 (4.6 శాతం) తగ్గింది. ఢిల్లీలో కిలోలీటర్‌కు రూ.1,11,344.92 నుంచి రూ.1,06,155.67కి తగ్గింది. నవంబర్ 1న జెట్ ఇంధనం ధర దాదాపు 6 శాతం (కిలోలీటర్‌కు రూ. 6,854.25) తగ్గింది.

రోడ్డు ప్రమాదంలో 8 మంది దుర్మరణం

భువనేశ్వర్ : ఒడిశాలోని క్యోంఝర్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శుక్రవారం ఉదయం బాలిజోడి వద్ద జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ఓ వ్యాను ఢీకొట్టింది. దీంతో ముగ్గురు మహిళలుసహా ఏడుగురు అక్కడికక్కడే మరణించగా, ఆసుపత్రిలో మరొకరు చనిపోయారు. మరో ఎనిమిదిమంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం ధాటికి వ్యాను ముందుభాగం నుజ్జునుజ్జయ్యింది. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను క్యోంఝర్ జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో జీపులో 21 మంది ప్రయాణిస్తున్నారని పోలీసులు తెలిపారు. మరణించిన వారందరూ గంజాం జిల్లా పొడమరి గ్రామానికి చెందినవారని చెప్పారు. వ్యాను బుక్ చేసుకుని, తమ గ్రామానికి 400 కిలోమీటర్ల దూరంలోని ఘటగావ్‌లో ఉన్న మాతా తారణి (పార్వతీదేవి) ఆలయానికి వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగిందన్నారు. పొగమంచు కారణంగా ముందు నిలిపివుంచిన వాహనాన్ని డ్రైవర్ గమనించి వుండకపోవచ్చునని తెలిపారు.

మణిపూర్‌లో భారీ బ్యాంకు దోపిడీ

- రూ.18.85 కోట్లు దోచుకెళ్లిన సాయుధ దుండగులు

ఇంఫాల్: మణిపూర్‌లో మైతీలు, కుకీల మధ్య ఘర్షణల తరువాత మూడో భారీ బ్యాంకు దోపిడీ జరిగింది. ఉఖ్రుల్‌జిల్లాలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో సాయుధ దుండగులు రూ.18.85 కోట్ల నగదును దోచుకెళ్లారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం బ్యాంక్ మేనేజర్, సిబ్బంది ఆ రోజు లావాదేవీలు, డిపాజిట్ కార్యకలాపాలను ముగించారు. మెయిన్ షట్టర్‌ను మూసేసి లోపల పనిచేసుకుంటున్నారు. ఆ సమయంలో సుమారు 10 మంది గుర్తు తెలియని సాయుధ దుండగులు అకస్మాత్తుగా లోపలికి ప్రవేశించారు. స్ట్రాంగ్ రూమ్ దగ్గర విధుల్లో ఉన్న బ్యాంక్ మేనేజర్, సెక్యూరిటీ సిబ్బందిపై దాడి చేసి, నగదు దోచుకెళ్లారు.

మళ్లీ గాజాలో ఇజ్రాయిల్ బాంబు దాడులు!

- 109మంది మృతి, వందలాదిమందికి గాయాలు
- నివాస ప్రాంతాలే లక్ష్యంగా దాడులు విస్తరిస్తామంటూ ప్రకటన
- కిక్కిరిసిన ఆస్పత్రులు, బెడ్‌లు లేక నేలపైనే రోగులు



జోర్డాన్‌లోని అమ్మన్‌లో పాలస్తీనాకు సంఘీభావంగా శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు

గాజా : ఏడు రోజుల పాటు అమలైన తాత్కాలిక కాల్పుల విరమణ గడువు ముగిసిన వెంటనే ఇజ్రాయిల్ మరోసారి బాంబుదాడులకు తెగబడింది. స్థానిక కాలమానం ప్రకారం శుక్రవారం ఉదయం 7గంటలకు కాల్పుల విరమణ గడువు ముగిసిపోయింది. వెంటనే తాజాగా జరిగిన దాడుల్లో 109 మంది పాలస్తీనియన్లు మరణించారని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. శుక్రవారం ఉదయం నుండే గాజా వ్యాప్తంగా అనేక నివాస భవనాలను లక్ష్యంగా చేసుకుంటూ ఇజ్రాయిల్ వైమానిక బలగాలు దాడులు జరిపాయి. మరణించిన వారిలో అత్యధికులు సామాన్యులే. రఫాలో నివాస భవంతిపై దాడి జరగడంతో అందులోని తొమ్మిదిమంది మరణించారు. సెంట్రల్ గాజాలో జరిగిన దాడిలో ఏడుగురు చనిపోయారు. వందలాదిమంది గాయపడ్డారు. శుక్రవారం నాటి దాడుల్లో మరో పాలస్తీనా జర్నలిస్టు చనిపోయాడని క్వాడ్స్ న్యూస్ నెట్‌వర్క్ తెలిపింది. ఈ యుద్ధంలో ఇప్పటివరకు 70మందికి పైగా పాలస్తీనా జర్నలిస్టులు ప్రాణాలు కోల్పోయారు. ఇప్పటికే బాంబు దాడులు ప్రారంభమైన ప్రాంతాల్లో, దక్షిణ గాజాలో పలుచోట్ల దాడులు మరింత విస్తరించబడతాయని సంకేతాలిస్తూ ఇజ్రాయిల్ సైన్యం కరపత్రాలు జారవిడిచింది. కాల్పుల విరమణను పునరుద్ధరించేందుకు కృషి చేస్తున్నట్లు ఖతార్ ప్రకటించింది. దాడులు పునరుద్ధరించిన తర్వాత ఇప్పటివరకు 200కిపైగా లక్ష్యాలపై దాడి చేసినట్లు ఇజ్రాయిల్ సైన్యం ప్రకటించింది. ఆ లక్ష్యాల్లో నివాస ప్రాంతాలు, శరణార్థ శిబిరాలు వున్నాయి. ఈ దాడుల్లో 109మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ అధికారులు తెలిపారు. ఖాన్ యూనిస్, రఫా నగరాలతో సహా గాజా ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో లక్ష్యాలపై పదాతి, వైమానిక, నావికా బలగాలు దాడులు జరిపా యని సైన్యం తెలిపింది. జబాలి యా శరణార్థ శిబిరంలో నిర్వాసితులందరూ తలదాచు కుంటున్న స్కూలుపై దాడి జరిగింది. స్కూలును మొత్తంగా కమ్మివేసేలా పొగ అలుముకోవడం వీడియోలో కనిపిస్తోంది. అత్యంత తీవ్రమైన మానవతా సంక్షోభం నెలకొన్న సమయంలో రఫా క్రాసింగ్‌ను తెరిచేందుకు అనుమతించాల్సిందిగా గాజా ఆరోగ్య శాఖ ప్రతినిధి అష్రఫ్ అల్ ఖుద్రా విజ్ఞప్తి చేశారు. కాల్పుల విరమణ సమయంలో గాజాలోకి ప్రవేశించిన వైద్య సాయం కేవలం ఒక రోజుకు మాత్రమే సరిపోతుందని చెప్పారు. గాజాలో ఆరోగ్య సేవలం రంగం స్తంభించిపోతోందన్నారు. కేవలం మూడు ఆస్పత్రులు మాత్రమే పనిచేస్తున్నాయని, అవి కూడా పెద్ద సంఖ్యలో రోగులకు సేవలందించేలా లేవన్నారు. ఇప్పటికే ఆస్పత్రులు కిక్కిరిసిపోవడంతో తాజా దాడుల్లో గాయపడిన వారందరూ బెడ్‌లు లేక నేలపైనే ఎక్కడబడితే అక్కడ పడుకుని వుండడం కనిపిస్తోంది. దాడుల నేపథ్యంలో ఈజిప్ట్ నుండి వచ్చే సాయం, ఇంధనం సరఫరాలన్నీ నిలిచిపోయాయని సహాయక అధికారులు తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందాన్ని పునరుద్ధరించేందుకు తాము కూడా కృషి చేస్తున్నామని అమెరికా పేర్కొంది. ఈ విషయంలో ఇజ్రాయిల్, ఈజిప్ట్, ఖతార్‌లతో కలిసి పనిచేస్తున్నామని జాతీయ భద్రతా మండలి ప్రతినిధి తెలిపారు. అమెరికా ప్రభుత్వ మద్దతుతోనే గాజాలో ఇజ్రాయిల్ బాంబు దాడులకు తెగబడుతోందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి విమర్శించారు.

ఇజ్రాయిల్ అధ్యక్షుడితో ప్రధాని మోడీ భేటీ

ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇజాక్ హెర్జోగ్‌తో భేటీ అయ్యారు. చర్చలు, దౌత్యం ద్వారా ఇజ్రాయిల్ - పాలస్తీనా సమస్యకు సత్వర, శాశ్వత పరిష్కారం కనుగొనేందుకు భారత్ మద్దతిస్తుందని చెప్పారు. దుబాయ్‌లో కాప్ 28 సదస్సు నేపథ్యంలో వీరి సమావేశం జరిగింది. ప్రస్తుతం సాగుతున్న యుద్ధంపై ఇరువురు నేతలు అభిప్రాయాలను పంచుకున్నారు. గాజాలోని ప్రజలకు మానవతా సాయాన్ని అందజేయడాన్ని కొనసాగించాల్సిన ఆవశ్యకతను ప్రధాని నొక్కి చెప్పారని, బందీల విడుదలను మోడీ స్వాగతించారని విదేశాంగ శాఖ ప్రతినిధి అరిందమ్ బగ్చి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. రెండు దేశాల ఏర్పాటే ఈ సమస్యకు పరిష్కారమని, భారత్ అందుకు మద్దతిస్తుందని చెప్పారు.

బిజెపికి రూ.719 కోట్ల విరాళాలు

- ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచే రూ.256.25 కోట్లు
- గతేడాది లెక్కలను విడుదల చేసిన ఇసి

న్యూఢిల్లీ : బిజెపికి వందల కోట్ల విరాళాలు ముంచెత్తుతున్నాయి. గతేడాది ఆ పార్టీకి రూ.719.83 కోట్లు సమకూరాయి. పార్టీ వార్షిక సహకార నివేదిక ఆధారంగా ఎన్నికల సంఘం ఈ విషయాన్ని వెల్లడించింది. ప్రకటించిన విరాళాల మొత్తంలో ఎలక్టోరల్ బాండ్‌ల పథకం కింద పార్టీ స్వీకరించే మొత్తాన్ని పేర్కొనరు. చెక్కు, బ్యాంక్ బదిలీ, ఆన్‌లైన్ లావాదేవీ, యుపిఐ చెల్లింపు రూపంలో రూ.20,000, అంతకంటే ఎక్కువ మొత్తం విరాళాల వివరాలను నివేదిక కలిగి ఉన్నది. నివేదిక ప్రకారం.. 2022-23లో దాదాపు 35 శాతం విరాళాలు ప్రుడెంట్ ఎలక్టోరల్ ట్రస్ట్ నుంచే వచ్చాయి. ఇది బిజెపికి మొత్తం రూ.256.25 కోట్లు ఇచ్చింది. 2021-22లో వ్యక్తులు, ట్రస్టులు, కంపెనీలు, సంఘాల నుంచి పార్టీకి అందిన మొత్తం విరాళాలు రూ.614.52 కోట్లుగా ఉన్నాయి. విరాళాలు ఇచ్చినవారి జాబితాలో ముఖ్యమంత్రులు హిమంత బిశ్వశర్మ (అసోం), యోగి ఆదిత్యనాథ్ (యూపీ), శివరాజ్ సింగ్ చౌహాన్ (మధ్యప్రదేశ్) సహా పార్టీ నేతలూ ఉన్నారు. దాతల జాబితాలో చిన్న వ్యాపారాలు, ప్రయివేటు పాఠశాలలు, విద్య, ఛారిటబుల్ ట్రస్టులు, మైనింగ్ కంపెనీలు, నిర్మాణ సంస్థలు, వ్యర్థ పదార్థాల నిర్వహణ కంపెనీలు, డిస్టిలరీలు, రెస్టారెంట్లు, మొక్కల నర్సరీలు, వైన్ షాపులు, 'అట్టా చక్కీలు', హార్డ్‌వేర్ దుకాణాలు ఉన్నాయి. 2021-22లో బిజెపి తన వార్షిక ఆడిట్ నివేదికలో ఎలక్టోరల్ బాండ్ల ద్వారా రూ.1,033.70 కోట్లు, ఇతర విరాళాల ద్వారా రూ.614.52 కోట్లు ప్రకటించింది. జాతీయ పార్టీలలో ఆప్ తనకందిన విరాళాలను రూ.37 కోట్లుగా ప్రకటించింది. కాంగ్రెస్ సహా ఇతర పార్టీల నివేదికలను ఇసి ఇంకా ప్రచురించలేదు.

రెండోసారి ఆమోదించి పంపిన బిల్లులను రాష్ట్రపతికి నివేదించలేరు

(మొదటి పేజీ తరువాయి)

పంపిన బిల్లులను రాష్ట్రపతికి పంపడాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. రాజ్యాంగంలోని 'ఆర్టికల్- 200'ను ప్రస్తావిస్తూ.. పున్ణపరిశీలన కోసం గవర్నర్ కార్యాలయం నుంచి తిరిగి వచ్చిన బిల్లులను శాసనసభ రెండోసారి ఆమోదించిన తరువాత గవర్నర్ వాటిని రాష్ట్రపతికి పంపలేరని స్పష్టం చేసింది. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 200 ప్రకారం, గవర్నర్‌కు మూడు ఎంపికలు ఉన్నాయి. ఆయన బిల్లుపై సమ్మతి తెలపవచ్చు. నిలిపివేయవచ్చు. ఆయన బిల్లును (పరిశీలన) రాష్ట్రపతికి రిజర్వ్ చేయవచ్చు. ఈ అన్ని ప్రత్యామ్నాయాలు అందుబాటులో ఉన్నాయి' అని ధర్మాసనం పేర్కొంది. 'ఈ కేసులో గవర్నర్ మొదట సమ్మతిని నిలుపుదల చేశారు. ఒకసారి ఆయన సమ్మతిని నిలిపివేస్తే, దానిని రాష్ట్రపతికి రిజర్వ్ చేసే ప్రశ్నే లేదు. ఆయన రాష్ట్రపతికి పంపలేరు. ఆయన మూడు ఎంపికలలో ఒకదాన్ని అనుసరించాలి. ఒకసారి ఆయన సమ్మతిని నిలుపుదల చేస్తే, నిబంధన ఆయనకు నాల్గో ఎంపికను ఇవ్వదు' అని తమిళనాడు గవర్నర్ తరపున హాజరైన అటార్నీ జనరల్ (ఎజిఐ) ఆర్ వెంకటరమణికి సిజెఐ జస్టిస్ చంద్రచూడ్ తెలిపారు. అనంతరం తదుపరి విచారణను ఈనెల 11కి వాయిదా వేసింది.



మీ కోసం

తులసి ఆకుల్ని నీళ్లలో రాత్రంతా నానబెట్టి ఉదయాన్నే ఆ నీటిని తాగితే నోటి దుర్వాసన తగ్గుతుంది.

జీవన సౌరభం


ఫలితంపై ఎంత శ్రద్ధ చూపిస్తారో.. దాన్ని పొందే పద్ధతుల్లోనూ అంతే శ్రద్ధ పాటించాలి.

చదువుదాం.. ఆడుదాం

చక్కగా చదువులు చదువుదాం
కల్మషం లేకుండా ఉందాం
సమతా మమతా పాటిద్దాం
అందరం స్నేహంగా ఉందాం
ఆటలు ఆడేద్దాం పాటలు పాడుదాం
కేరింతలతో ఎగురుదాం
చెట్టా పట్టాల్ వేసుకుందాం
సమైక్యతతో ముందుకు పోదాం
కలసి మెలసి ఉందాం
చదువుతూ ఆడుదాం
ఆడుతూ చదువుదాం
మన చదువు మన పాట
జాతికే అంకితం !



- కనుమ ఎల్లారెడ్డి,
93915 23027.



చుక్కలు కలపండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అంకెలను వరుసగా కలిపితే అందమైన బొమ్మ వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ



ఎన్.నాగమ్మ,
5వ తరగతి,
దిగువ సాంబయ్య పాళెం,
తొట్టంబేడు మండలం,
తిరుపతి జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ఆమె జీవితాన్ని జయించింది..!

శాంతి మునుస్వామి జీవితం ఎన్నో సవాళ్లమయం. అబ్బాయిగా పుట్టి అమ్మాయిలా మారిపోయిన తనను ఎంతోమంది అవమానించారు. వేధించారు. విధిలేని పరిస్థితుల్లో, పస్తులు పడుకున్న దీనస్థితిలో తన ఒంటినే సరుకుగా మార్చుకుంది. ఆ జీవితం.. ఎన్నో కాళరాత్రులను మిగిల్చింది. అప్పడే తన బతుకు బాగు చేసుకోవాలంటే, ఓ అడుగు ముందుకు వేయాలని నిశ్చయించుకుంది. ఆ నిర్ణయం ఇప్పడామెను ప్రత్యేకంగా నిలిపింది.



'అమ్మ ఎంత అందంగా ముగ్గు వేసిందో.. ఆ డిజైన్ చాలా ముచ్చటగా ఉంది. దానికి అద్దిన రంగులు ఎంత బాగున్నాయో' అనుకుంటూ వాకిలికి దూరంగా ఉన్న ఓ గదిలో తెరచాటు నుండి ఆ రంగవల్లి వంకే తదేకంగా చూస్తుండిపోయింది శాంతి మునుస్వామి. ఆ తన్మయత్వంలో ఒకసారి తనను తాను నియంత్రించుకోలేక అమ్మ దగ్గరకి పరుగెత్తుకు వచ్చింది. 'అమ్మా.. నేను కూడా వేస్తాను' అంటూ మురిపెంగా అడిగింది. 'ఛ నోర్ముయ్.. ఇది ఆడపిల్లల పని. ముందు ఇక్కడి నుండి వెళ్లు' అని కళ్లు ఇంత పెద్దవి చేసి మరీ గదిమింది అమ్మ. ఎందుకంటే శాంతి మునుస్వామి అప్పుడు శంకర్ మునుస్వామిగా ఉన్నాడు. ప్యాంట్లు, షర్టు వేసుకుంటున్నా, లోపల గదిలో తన చెల్లి గౌనులు, వేసుకుని ఎంతో మురిసిపోయేవాడు. స్కూల్లో అమ్మాయిలతో ఎక్కువ స్నేహం చేసేవాడు. బార్బీ బొమ్మలతో ఆడుకునేవాడు. ఇవన్నీ ఆ తల్లికి నచ్చేవి కావు. ఆ కుటుంబం ఒప్పుకునేది కాదు. ఎన్నోసార్లు అమ్మ చేతిలో దెబ్బలు తిన్నాడు. తనపై ఇంతటి విద్వేషం ఎందుకో అర్థం కాని వయసులో ఇంట్లో, స్కూల్లో వేధింపులు తాళలేక పదో తరగతితో చదువు ఆపేశాడు.

ఓ మందుల షాపులో పనికి వెళ్లిన శంకర్, పనిలో తీరిక లేకుండా ఉన్నా, తన బాధలు పట్టించుకునే వారు లేరని ఎంతో మదనపడేవాడు. ఒక్కోసారి షాపు బయట ఓ మూల కూర్చొని బోరున ఏడ్చేవాడు. 'ఆ రోజు నాకు బాగా గుర్తుంది. షాపు బయట ఏడుస్తున్న నన్ను ఒకావిడ పలకరించింది. ఆమె నన్ను ఓ అమ్మాయిగా సంబోధించింది. అప్పుడు నాకు చాలా సంతోషమేసింది. ఆ రోజు నుండి నాలో ఏదో తెలియని ధైర్యం వచ్చింది. నా బాధ అంతా ఆమెతో పంచుకున్నాను. తనతో రమ్మంది. అలా నేను ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీలోకి అడుగుపెట్టాను. ఇది జరిగిన కొన్నేళ్లకు నేను ఇంటికి వచ్చాను. అమ్మ నన్ను ఒప్పుకోలేదు. 'నేను అబ్బాయికి జన్మ ఇచ్చాను. అమ్మాయికి కాద'ని చెప్పింది. పెళ్లి చేస్తానని బలవంత పెట్టింది. గదిలో వేసి గడియ వేసింది. అమ్మానాన్నతో బాగా గొడవపడ్డాను. నేను ఇక ఇంటికి





రానని, నన్ను వదిలేయమని బతిమాలాను. అలా ఆ రోజు ఇంటి నుండి బయటపడి, ట్రాన్స్ కమ్యూనిటీలో చేరిపోయాను' అంటున్న శాంతి 21 ఏళ్ల వయసులో సెక్స్ వర్కర్‌గా జీవితాన్ని ప్రారంభించింది.

ఇలా ఎన్నో చేదు అనుభవాలతో నిండిపోయిన శాంతి జీవితం ఓ అందమైన మలుపుకు దారిమళ్లే సందర్భం కొన్నేళ్ల తరువాత వచ్చింది. బెంగుళూరుకు చెందిన ఓ రీసెర్చ్ సెంటర్ శాంతి జీవితకథను ప్రపంచానికి చెప్పమని ఆహ్వానించింది. తమ సంస్థలో రేడియో జాకీగా ఉండమని మార్గం చూపించింది. 'నాకు రేడియో గురించే తెలియదు. కానీ, ఈ మురికికూపం నుండి బయటపడాలంటే ఇంతకంటే మంచి అవకాశం రాదని ఒప్పుకున్నాను. రికార్డింగ్, లైవ్ ప్రోగ్రామ్ ఇవ్వడం, ఎడిటింగ్ వంటివన్నీ నేర్చుకున్నాను. అయితే కొత్త జీవితాన్ని ప్రారంభించిన ఆనందం ఎన్నో రోజులు నిలవలేదు.

ఎంతో ఆనందంగా రేడియో జాకీగా జీవితాన్ని ప్రారంభించినా, మూడేళ్లకు మించి అక్కడ పనిచేయలేకపోయాను. శస్త్రచికిత్స చేసుకోవాలని ఎంతో తపించేదాన్ని. ఉద్యోగాన్ని వదిలి చికిత్స చేయించుకున్నాను. అది వికటించింది. మానసికంగా, శారీరకంగా ఎంతో కుంగిపోయాను. నాలాగే ఎంతోమంది ఇలాంటి బాధలే పడుతుంటారు. వారందరికీ మంచి జీవితాలు ఎవరు ఇస్తారు? మేమంతా ఇలా ఉండిపోవాల్సిందేనా? అని ఎంతో మదనపడేదాన్ని.

చిన్నప్పుడు అమ్మ వేసిన ముగ్గులకు ఆకర్షితురాలినై చిత్రకళ నేర్చుకున్నాను. ఆ కళనే ఇప్పుడు నా జీవితాన్ని బాగుచేసుకునే మార్గంగా వేయాలనుకున్నాను. నాలాగే ఆలోచించే వారందరినీ ఓ బృందంగా తయారుచేశాను. 'ఆరావణి కళ' పేరుతో శిక్షణ ఇచ్చాను. అయితే మాలాంటి వారికి ఎవరు పని ఇస్తారు? ఎంతో కాలం ఎదురుచూసిన తరువాత ఓ స్వచ్ఛంద సంస్థ నుండి ఆహ్వానం వచ్చింది. ఆ ప్రాజెక్టు పనిని మేమంతా ఎంతో బాగా పూర్తిచేశాం. నిలువెత్తు గోడలపై, రెండు నిచ్చెనల ఎత్తులో నిలబడి బొమ్మలు వేశాం. మా పనితనానికి ఎంతో గుర్తింపు వచ్చింది. ఆ గుర్తింపు మా ఇంటి వరకు చేరింది. ఈ దీపావళికి అమ్మ నన్ను ఇంటికి పిలిచింది. నా కోసం పంజాబీ డ్రెస్ తీసుకొచ్చింది. ఇది నేను ఊహించని పరిణామం. ఇంట్లో అందరూ నన్ను ఎంతోప్రేమగా చూశారు. 20 ఏళ్ల క్రితం ఇలా లేదు' అంటున్న శాంతి మునుస్వామి బృందం వేసిన చిత్రాలు ఇప్పుడు బెంగుళూరు మెట్రోస్టేషను 36 పిల్లర్లపై చూడవచ్చు. పూనేలో విహెచ్1 సంగీత కచేరి సందర్భంగా ఆ మ్యూజిక్ ఛానెల్ గోడపై వీక్షించవచ్చు. ఇంకా ఆ బృందం, కోవిడ్ సమయంలో 2021లో కోవిడ్ యోధులకు సెల్యూట్ చేసే కుడ్య చిత్రాలను స్వామి వివేకానంద మెట్రో స్టేషనులో చిత్రించారు. ఇలా ఎన్నో చోట్ల శాంతి, ఆమె బృందం వేసిన చిత్రాలు అలరిస్తున్నాయి. ఎన్నో సవాళ్లను ఎదుర్కొని, ప్రత్యేకమైన వ్యక్తిగా గుర్తింపు ఉన్నా, తనతో పాటు తన వారి జీవితాలలో వెలుగులు నింపిన శాంతి మునుస్వామి లాంటి వారు అభినందనీయులు.



సీతాఫలం ఆకుల్లోనూ పోషకాలు


ఈ సీజన్‌లో లభించే ఫలాల్లో సీతాఫలం అత్యంత మధురమైనది. ఫలమే కాదు; ఆకుల్లోనూ ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. సీతాఫలం ఆకుల్లో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా లభిస్తాయి. ఆకులను శుభ్రంగా కడిగి ఒక గ్లాసు నీటిలో వేసి బాగా మరిగించాలి. తరువాత ఈ నీటిని వడపోసుకుని గోరువెచ్చగా ఉన్నప్పుడు తాగాలి. సీతాఫలం ఆకుల కషాయాన్ని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. వైరస్, బ్యాక్టీరియా శరీరంలోకి ప్రవేశించకుండా అడ్డుకుంటాయి.. సీతాఫలం ఆకుల కషాయం మధుమేహులకు వరంగా చెప్పొచ్చు. పరగడుపున ఈ ఆకుల కషాయాన్ని తాగితే రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది అని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల కషాయాన్ని తాగితే వృద్ధాప్య ఛాయలను తొలగించి చర్మం కాంతివంతంగా మెరిసేలా చేస్తుంది. గుండె ఆరోగ్యానికి చాలా మంచిది. గుండె పోటు రాకుండా చేస్తుంది. పుండ్లు, గాయాలు ఉన్నచోట ఈ ఆకులను ముద్దగా నూరి ఆ మిశ్రమాన్ని వాటిపై ఉంచాలి. ఇలా చేస్తూ ఉంటే త్వరగా మానిపోతాయి. గజ్జి, తామర, దురద ఉన్నచోట కూడా ఈ ఆకుల మిశ్రమాన్ని రాస్తే చర్మ సంబంధిత సమస్యలను తొలగిస్తుంది. ఈ ఆకుల పొడిని కలిపి రాసుకుంటే ముఖం కాంతివంతంగా మారుతుంది.



డబ్బింగ్ అంటే నాకు భయం
మాళవిక


'సినిమా మేకింగ్‌లో నాకు డబ్బింగ్ చెప్పడమే అన్నిటికంటే కష్టమైన పని. నేను ఈ సినిమాకు డబ్బింగ్ చెప్పేటప్పుడు ఎవరైనా వచ్చి నాచేయి పట్టుకుని ధైర్యాన్నిస్తారా' అంటూ సరదాగా పోస్ట్ పెట్టారు హీరోయిన్ మాళవికా మోహనన్. సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉండే తారల్లో నటి మాళవిక మోహనన్ ఒకరు. అప్పుడప్పుడు అభిమానులతో ముచ్చటించే మాళవిక తన సినిమాలకు సంబంధించిన అప్‌డేట్‌లను తరచూ షేర్ చేస్తుంటారు. ప్రస్తుతం ఆమె విక్రమ్ హీరోగా రూపొందుతోన్న 'తంగలాన్'లో నటిస్తున్నారు. తాజాగా ఆ సినిమాకు సంబంధించిన అప్‌డేట్‌ను షేర్ చేస్తూ మాళవిక చేసిన పోస్ట్ వైరల్‌గా మారింది.

'బచ్చలమల్లి'గా అల్లరి నరేష్



అల్లరి నరేష్ 63వ చిత్రంగా తెరకెక్కనున్న చిత్రానికి 'బచ్చల మల్లి' అనే టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ సినిమా శుక్రవారం ప్రారంభమైంది. దర్శకుడు అనిల్ రావిపూడి క్లాప్ కొట్టగా.. డైరెక్టర్స్ మారుతి, బుచ్చిబాబు యూనిట్‌కు కథను అందించారు. అల్లరి నరేష్ హీరోగా.. సుబ్బు మంగాదేవి దర్శకత్వంలో హాస్య మూవీస్ బ్యానర్‌పై ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. రాజేష్ దండా, బాలాజీ గుత్తా నిర్మిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తుని ప్రాంతానికి చెందిన పేరటి దొంగగా పేరు పొందిన వ్యక్తి 'బచ్చల మల్లి'. అతని జీవిత కథ ఆధారంగా ఈ సినిమా తెరకెక్కుతున్నట్లు తెలుస్తోంది. 1990లో ఈ ప్రాంతాన్ని బచ్చల మల్లి హైజాక్ చేశాడు. అతని జీవితంలో జరిగిన సంఘటనలతో పాటు ఓ సామాజిక సమస్యకు సంబంధించి ఈ చిత్రం తెరకెక్కుతోంది. అమృత అయ్యార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కోట జయరామ్, రావు రమేష్, సాయి కుమార్, ధనరాజ్, హరితేజ వంటి నటీనటులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. 'సీతా రామం' ఫేమ్ విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తున్నారు. రెగ్యులర్ షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుందని చిత్రబృందం తెలిపింది.

సలార్ ట్రైలర్ విడుదల



ప్రభాస్ ప్రధాన పాత్రలో, ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కిన 'సలార్' చిత్రం డిసెంబర్ 22, 2023న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. తెలుగు, కన్నడ, హిందీ, తమిళ, మలయాళ భాషల్లో రిలీజ్ చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ శుక్రవారం విడుదలైంది. 5 భాషల్లో ఈ ట్రైలర్‌ని విడుదల చేశారు. శృతి హాసన్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో జగపతి బాబు, పృథ్వీ రాజ్, శ్రియా రెడ్డి తదితరులు కీలక పాత్రల్లో నటించారు.



పరిశ్రమలో కుల, మత భేదాల్లేవు : పేరరసు

'కుల,మత, జాతి భేదాలు లేనిది చిత్ర పరిశ్రమ. దీనికి నిదర్శనం ఈ చిత్రానికి దర్శకత్వం వహించింది ఒక ముస్లిము టెక్నీషియన్. జయకాంత్– రాజా మొహ్మద్‌లను చూస్తుంటే నాకు విజయకాంత్– ఇబ్రహీం రౌథర్ కాంబినేషన్ గుర్తుకు వస్తోంది. విజయకాంత్ విజయంలో ఇబ్రహీంపాత్ర కీలకం. వారిద్దరి మధ్య కుల, మత భేషజాలు లేవు.'అని కోలీవుడ్ దర్శకుడు పేరరసు వ్యాఖ్యానించారు. శ్రీ ఆండాల్ మూవీస్ పతాకంపై పి.వీర అమృతరాజ్ నిర్మాణంలో డెబ్యూ డైరెక్టర్ జె.రాజా మొహ్మద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'మునియాండియిన్ మునిప్పాయిస్సల్'.జయకాంత్ హీరో. ఈ సినిమా ఆడియో విడుదల వేడుక తాజాగా చెన్నైలో జరిగింది. ఆర్‌వి ఉదయకుమార్‌తో పాటు చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.



సీనియర్ నటి ఆర్.సుబ్బలక్ష్మి మృతి

దక్షిణాది చిత్ర పరిశ్రమకు చెందిన సీనియర్ నటి ఆర్.సుబ్బలక్ష్మి (87) గురువారం రాత్రి తుదిశ్వాస విడిచారు. ఆమె గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండగా కుటుంబ సభ్యులు కొచ్చిలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. సుబ్బలక్ష్మికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆమె తెలుగు, తమిళ, మళయాళ, కన్నడ, హిందీ భాషలతోపాటుగా సంస్కృతంలో కూడా ఒక సినిమా చేశారు. తెలుగులో వేణు తొట్టెంపూడి నటించిన 'కళ్యాణ రాముడు' సినిమాలో బామ్మ పాత్రలో నటించారు. నాగచైతన్య 'ఏ మాయ చేశావే'లో సమంతకు అమ్మమ్మగా నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. చివరిగా 'బీస్ట్' సినిమాలో ఆమె కనిపించారు. ఏక్ దీవానా, తా, దిల్ బేచారా చిత్రాలతో బాలీవుడ్ ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. మొత్తంగా 70కుపైగా చిత్రాల్లో నటించారు. సినిమాల్లోనే కాకుండా బుల్లితెరపై కూడా ఆమె సందడి చేశారు. ఎన్నో సీరియళ్లలో నటించి ఆకట్టుకున్నారు. సినీ పరిశ్రమలోకి రాకముందు జవహర్ బాలభవన్‌లో సంగీత, నాట్య శిక్షకురాలిగా పనిచేశారు. 1951లో ఆలిండియా రేడియోలో ఉద్యోగం చేశారు. దక్షిణభారత దేశంలో ఆలిండియా రేడియోలో పనిచేసిన తొలి లేడీ కంపోజర్‌గా సుబ్బలక్ష్మి రికార్డు సృష్టించారు. డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కూడా పేరు తెచ్చుకున్నారు.

స్పిన్నర్ల దెబ్బకు ఆసీస్ కుదేల్..

- నాల్గో టి20లో 20పరుగుల తేడాతో నెగ్గిన టీమిండియా
- సిరీస్ 3–1తో కైవసం



రింకూ సింగ్(46)

రాయ్‌పూర్: స్పిన్నర్ అక్షర్ పటేల్‌కి తోడు రవి బిష్ణోయ్ బౌలింగ్‌లో రాణించడంతో భారతజట్టు 20పరుగుల తేడాతో ఆసీస్‌ను చిత్తుచేసింది. భారత్ నిర్దేశించిన 175పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆస్ట్రేలియా జట్టు నిర్ణీత 20 ఓవర్లు పూర్తయ్యేసరికి 8వికెట్ల నష్టానికి 154పరుగులే చేయగల్గింది. స్పిన్నర్ అక్షర్ పటేల్(3/16), బిష్ణోయ్(1/17) పొదుపుగా బౌలింగ్ చేసి ఆస్ట్రేలియాను కట్టడి చేశారు. తొలుత రింకు సింగ్(46), జైస్వాల్(37), గైక్వాడ్(32) బ్యాటింగ్‌లో రాణించడంతో భారతజట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి 174పరుగులు చేసింది. రింకూ సింగ్ 29 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సులతో 46 పరుగులు, వికెట్ కీపర్ జితేశ్ శర్మ 19 బంతుల్లో ఫోర్, 3 సిక్సులతో 35 పరుగులు సాధించాడు. శ్రేయస్ అయ్యర్ (8), సూర్యకుమార్ యాదవ్ (1) నిరాశపరిచారు. 4వికెట్ల నష్టానికి 167పరుగులతో పటిష్టంగా ఉన్న టీమిండియా.. ఏడు పరుగుల వ్యత్యాసంలో ఐదు వికెట్లు కోల్పోయింది. ఆసీస్ బౌలర్లలో బెన్ ద్వార్షిస్‌కు మూడు, బెహ్రెన్ డార్ఫ్, సంఘాకు రెండేసి, ఆరోన్ హార్డీకి ఒక వికెట్ దక్కాయి. అనంతరం ఆస్ట్రేలియా జట్టు 3ఓవర్లలోనే 40పరుగులు చేసి సునాయాసంగా లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించింది. ఆ దశలో స్పిన్నర్ రవి బిష్ణోయ్... ఫిలిప్‌ను బౌల్డ్‌చేసి తొలి బ్రేక్ ఇచ్చాడు. ఆ తర్వాత అక్షర్ రాణించడంతో ఆసీస్ జట్టు వరుసగా వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ మాథ్యూ వేడ్(36నాటౌట్), హెడ్(31) టాప్ స్కోరర్స్. అక్షర్‌కు మూడు, దీపక్ చాహర్‌కు రెండు వికెట్లు దక్కాయి. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అక్షర్ పటేల్‌కు దక్కగా... ఐదో, చివరి టి20 బెంగళూరు వేదికగా ఆదివారం జరగనుంది.

రుతురాజ్ రికార్డు...

రుతురాజ్ గైక్వాడ్‌మరో రికార్డు నెలకొల్పాడు. టి20ల్లో వేగంగా 4వేల పరుగుల కొట్టిన భారత తొలి బ్యాటర్‌గా నిలిచాడు. ఈ క్రమంలోనే టి20ల్లో వేగంగా 4 వేల పరుగులు కొట్టిన ఐదో బ్యాటర్‌గా నిలిచాడు. రాయ్‌చూర్ వేదికగా ఆస్ట్రేలియాతో శుక్రవారం జరిగిన నాల్గో టి20లో గైక్వాడ్ ఈ ఫీట్ సాధించాడు. గైక్వాడ్ 116 ఇన్నింగ్స్‌ల్లోనే 4 వేల పరుగులు పూర్తిచేశాడు. దాంతో కేఎల్ రాహుల్ (117 ఇన్నింగ్స్‌లు) రికార్డు బద్దలైంది. ఈ ఫార్మాట్‌లో వేగంగా 4వేల పరుగులు కొట్టిన బ్యాటర్ల జాబితాలో క్రిస్ గేల్(107 ఇన్నింగ్స్) ముందున్నాడు. ఆ తర్వాత షాన్ మార్ష్(113 ఇన్నింగ్స్), బాబర్ ఆజాం(115 ఇన్నింగ్స్), డెవాన్ కాన్వే(116 ఇన్నింగ్స్) వరుసగా రెండు, మూడు, నాలుగు స్థానాల్లో కొనసాగుతున్నారు.

స్కోర్‌బోర్డు..

ఇండియా ఇన్నింగ్స్: జైస్వాల్ (సి)డెర్మాట్ (బి)హార్డి 37, గైక్వాడ్ (సి)డ్వార్షూస్ (బి)సంఘా 32, శ్రేయస్ (సి)క్రిస్ గ్రీన్ (బి)సాంఘా 8, సూర్యకుమార్ (సి)వేడ్ (బి)డ్వార్షూస్ 1, రింకు సింగ్ (ఎల్‌బి)బెహ్రెన్‌డార్ష్ 46, జితేశ్ శర్మ (సి)హెడ్ (బి)డ్వార్షస్ 35, అక్షర్ పటేల్ (సి)సంఘా (బి)డ్వార్షస్ 0, దీపక్ చాహర్ (సి)క్రిస్ గ్రీన్ (బి)బెహ్రెన్‌డార్ఫ్ 0, రవి బిష్ణోయ్ (రనౌట్) ఫిలిప్స్/హెడ్ 4, ఆవేశ్ ఖాన్ (నాటౌట్) 1, అదనం 10. (20 ఓవర్లలో 9వికెట్ల నష్టానికి) 174పరుగులు. **వికెట్ల పతనం:** 1/50, 2/62, 3/63, 4/111, 5/167, 6/168, 7/168, 8/169, 9/174 **బౌలింగ్:** హార్డి 3–1–20–1, బెహ్రెన్‌డార్ఫ్ 4–0–32–2, డ్వార్షస్ 4–0–40–3, క్రిస్ గ్రీన్ 4–0–36–0, సాంఘ్వా 4–0–30–2, షార్ట్ 1–0–10–0.

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్: హెడ్ (సి) ముఖేశ్ (బి)అక్షర్ 31, ఫిలిప్స్ (సి)బిష్ణోయ్ 8, డెర్మాట్ (బి)అక్షర్ 19, హార్డీ (బి)అక్షర్ 8, టిమ్ డేవిడ్ (సి)జైస్వాల్ (బి)దీపక్ చాహర్ 19, షార్ట్ (సి)జైస్వాల్ (బి)చాహర్ 22, వేడ్ (నాటౌట్) 35, డ్వార్షస్ (బి)ఆవేశ్ ఖాన్ 1, క్రిస్ గ్రీన్ (నాటౌట్) 2, అదనం 8, (20 ఓవర్లలో 8వికెట్ల నష్టానికి) 154పరుగులు.

వికెట్ల పతనం: 1/40, 2/44, 3/52, 4/87, 5/107, 6/126, 7/133 **బౌలింగ్:** దీపక్ చాహర్ 4–0–44–2, ముఖేశ్ కుమార్ 4–0–42–0, రవి బిష్ణోయ్ 4–0–17–1, అక్షర్ పటేల్ 4–0–16–3, ఆవేశ్ ఖాన్ 4–0–33–1.

15 నుంచి 'ఆడుదాం ఆంధ్రా'

- 2 రోజుల్లో సచివాలయాలకు క్రీడా సామగ్రి
- మంత్రి ఆర్‌కె రోజా

ప్రజాశక్తి–అమరావతి బ్యూరో

ఆడుదాం ఆంధ్రా కార్యాక్రమం ఈ నెల 15 నుంచి ప్రారంభం కానుందని రాష్ట్ర యువజనాభివృద్ధి, పర్యాటకశాఖ మంత్రి ఆర్‌కె రోజా అన్నారు. గ్రామ, వార్డు, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఫిబ్రవరి 3 వరకు కొనసాగనున్నాయని చెప్పారు. క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఛైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలిసి విజయవాడలోని మున్సిపల్ స్టేడియంలో ఈ కార్యక్రమ వివరాలను శుక్రవారం విలేకరులకు తెలిపారు. యువతలో క్రీడా స్ఫూర్తిని పెంచడానికి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం తలపెట్టారని చెప్పారు. క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో క్రీడలు నిర్వహిస్తామన్నారు. 15 ఏళ్ల వయసు పైబడిన వారు రిజిస్టర్ చేసుకోవచ్చునని వివరించారు. 50 రోజులపాటు నిర్వహించే పోటీల్లో దాదాపు 3 లక్షల మ్యాచ్‌లు జరగనున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు వెబ్‌సైట్‌లో 5 లక్షల మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారని, కోటిమంది చేసుకుంటారని అంచనా వేస్తున్నామని చెప్పారు. సుమారు రూ.100 కోట్లకు పైగా బడ్జెట్‌తో నిర్వహిస్తున్నామని, రూ.12 కోట్లు క్రీడాకారుల బహుమతులు, ట్రోఫీలు, పతకాల కోసం ఖర్చు చేస్తున్నామని వివరించారు. రెండు రోజుల్లో క్రీడా సామగ్రి సచివాలయాలకు చేరుతాయని చెప్పారు. ఫిబ్రవరి 3న విశాఖపట్నంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. బైరెడ్డి మాట్లాడుతూ.. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు ప్రోత్సాహకం అందించామని చెప్పారు. ప్రతిభావంతులైన క్రీడాకారులకు అందించే బకాయిలను చెల్లించా మన్నారు. క్రీడా శాఖ ద్వారా ఇప్పటికే 2,400కు పైగా ఉద్యోగాలు ప్రభుత్వం కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో యువజన సర్వీసులశాఖ ముఖ్యకార్యదర్శి ప్రద్యుమ్న, శాప్ ఎమ్‌డి ధ్యాన్‌చంద్ర పాల్గొన్నారు.



'ఆడుదాం ఆంధ్రా' మస్కట్ 'కిట్టు'తో మంత్రి ఆర్కే రోజా తదితరులు

ఐప్యాక్ టీం హడావుడి

రాజకీయ వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ టీం సభ్యులు మంత్రి రోజా నిర్వహించిన కార్యక్రమంలో హడావుడి చేశారు. సాధారణంగా ప్రభుత్వ కార్యక్రమంలో ఆ శాఖలకు చెందిన అధికారులు ఏర్పాట్లను చూస్తారు. అయితే ఇక్కడ అందుకు భిన్నంగా ఐప్యాక్ సభ్యులు ఏర్పాట్లను చూసుకున్నారు. సుమారు 20 మందికి పైగా ఆ టీం సభ్యులే అక్కడ ఉండి మంత్రి కార్యక్రమంలో హడావుడి చేశారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68